# మనం కరీంనగర్

జగిత్యాల-రాజన్న సిరిసిల్ల-పెద్దపల్లి-అసిఫాబాద్-మంచిర్యాల

శనివారం | 21 | మార్చి | 2026 | పేజీలు 13 | www.manamepaper.com


# శ్రీ సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలను అద్భుతంగా జరిపించాలి

- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి
- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



**ఇల్లందకుంట, మార్చి 20 (మనం న్యూస్):** దఅపర అయోధ్యగా పేరొందిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిపించనున్న శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా, వైభవంగా నిర్వహించాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇల్లందకుంట దేవాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... భద్రాద్రి తర్వాత ప్రాముఖ్యత కలిగిన ఇల్లందకుంట దేవాలయంలో జరిగే శ్రీరామ కళ్యాణం ఎంతో అద్భుతంగా జరుగుతుందని, ఈ వేడుకకు సుమారు లక్ష మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ మరియు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తులకు తాగునీరు, పారిశుధ్యం, విశ్రాంతి వంటి అన్ని సౌకర్యాలు సమృద్ధిగా కల్పించాలని, కార్యక్రమం నిరాటంకంగా జరిగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా ఆలయ ప్రాంగణాన్ని పూర్తిగా శుభ్రంగా ఉంచుతూ శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.

# సమన్వయంతో బాలికలకు హెచ్.పి.వి వ్యాక్సిన్



**కరీంనగర్ మార్చి 20(మనం బ్యూరో):** వివిధ శాఖలు సమన్వయంతో పని చేస్తూ జిల్లాలో నిర్వహిస్తున్న హెచ్.పి.వి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. విద్య, ఆరోగ్య, మహిళా సంక్షేమ శాఖ, డిఆర్డిఏ, ఎస్సీ ఎస్టీ సంక్షేమ తదితర శాఖల అధికారులతో హెచ్పీవీ వ్యాక్సిన్ పై సమన్వయ సమావేశం అడిషనల్ కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ జిల్లాలోని కరీంనగర్ మాతా శిశు, జమ్మికుంట, హుజరాబాద్ ఏరియా ఆసుపత్రిలో హెచ్పీవీ వ్యాక్సినేషన్ కొనసాగుతుందని తెలిపారు. ఈ ఆస్పత్రులకు సమీపంలోని పాఠశాలల్లో

- మిగతా 2వ పేజీలో..

# విద్యాలయ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నెన్నెల,మార్చి 20, 2026(మనం న్యూస్ ):** కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నెన్నెల

- మిగతా 2వ పేజీలో..

# పోలీస్ సిబ్బంది ఆరోగ్యం విషయంలో రాజీ పడబోం

కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో నూతన విశ్రాంతి గదిని ప్రారంభించిన సీపీ గౌష్ ఆలం



**కరీంనగర్, మార్చి 20, (మనం న్యూస్ ):** పోలీస్ సిబ్బంది సంక్షేమం పనితీరును మెరుగు పరిచే లక్ష్యంతో, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శుక్రవారంనాడు కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన విశ్రాంతి గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నిరంతరం విధుల్లో ఉండే పోలీస్ సిబ్బందికి మానసిక ప్రశాంతత, శారీరక విశ్రాంతి ఎంతో అవసరమని పేర్కొన్నారు. సిబ్బంది ఆరోగ్యం, సౌకర్యాల విషయంలో రాజీ పడబోమని, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా వారి పనితీరు మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అన్ని పోలీస్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలను ఆధునీకరించి, సిబ్బందికి మెరుగైన పని వాతావరణాన్ని కల్పించడానికి విభాగం కట్టుబడి ఉందని సీపీ తెలిపారు. తగిన విశ్రాంతి పొందిన అధికారులు అత్యవసర సమయాల్లో మరియు ప్రజలకు సేవ చేయడంలో మరింత చురుగ్గా,

- మిగతా 2వ పేజీలో..

# సమస్యల సాధనకే సేవ్ సింగరేణి జాత

- 30న కార్మికులతో కార్పెట్ ముట్టడి
- ఏఐటియుసి నాయకుల వెల్లడి




2లో..

**కాసిపేట, మార్చి 20(మనం న్యూస్):** పెండింగ్ లో ఉన్న పలు కార్మికుల సమస్యల సాధన కోసం సేవ్ సింగరేణి పేరిట జాత ఆందోళన కార్యక్రమం చేపట్టినట్టు కంపెనీ గుర్తింపు సంఘం ఏఐటీయుసి నాయకులు తెలియచేశారు.

# సమస్యల సాధనకే సేవ్ సింగరేణి జాత

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం మందమర్రి ఏరియా కాసిపేట 1, 2 గనులకు జాత చేరుకోగా కార్మికులు, గనుల నాయకులు ఘన స్వాగతం పలికారు. జాత లో పాల్గొన్న నాయకులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయా గనులపై ఏర్పాటు చేసిన సమావేశాల్లో నాయకులు మాట్లాడారు.సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని, గత ప్రభుత్వం నుండి మొదలైన ఈ విధానం ప్రస్తుత ప్రభుత్వంలో మితిమీరిందని అన్నారు. ఇటు ఎమ్మెల్యే, ఎంపీ లు అటు ప్రభుత్వం చొరబాటు, కంపెనీ లో సంఘాల ప్రాధాన్యత ను ప్రశ్నార్థకంగా మారుస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో అమలులో ఉన్న మెడికల్ బోర్డ్ (కారుణ్యనియామకాలు), ఏసీబీ కేసులు సాకుగా పదకొండు నెలల నుండి నిలిచి పోయిందని అన్నారు, క్లరికల్ నియామకాలు, మెడికల్ బోర్డ్ ద్వారా ట్రైనింగ్ పూర్తి చేసుకుని నియామకాల కోసం 300 మంది ఎదురు చూస్తున్న యువకులకు అపాయింట్మెంట్ ఇవ్వడం లేదని, ప్రభుత్వం నుండి సింగరేణి రావాల్సిన 56 వేల కోట్లు బకాయిలు చెల్లించడం లేదని తెలియచేశారు. కార్మికుల స్వంత ఇంటి పతకం, అధికారులకు అమలు చేస్తున్న పేర్క్ పై ఆదాయ పన్ను రద్దు, కార్మికులకు వర్తింప చేయడం లేదని, ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న మారుపేర్ల విషయాన్ని తేల్చడం లేదని విమర్శలు గుప్పించారు. కేంద్రం ప్రభుత్వ విధానాల వలన కొత్త గనుల ఏర్పాటు కావడం లేదని, ప్రస్తుత గనులు జీవితకాలం ముగియనున్న సందర్భంలో సంస్థ మనుగడకు ప్రమాదంగా ఉన్నాయని, ఏప్రిల్ నుండి కొత్త లేబర్ కోడ్ విధానం అమలుకు కుట్రలు చేస్తున్నదని, ఇలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తప్పుడు విధానాల వలన కంపెనీ లో ప్రయివేటీకరణ, కాంట్రాక్టీకరణ పెరిగి, కంపెనీ దివాళా, కార్మికుల హక్కుల హరణ కు నాయకుల చర్యలు ఉంటున్నాయని మండిపడ్డారు. ఈ విధానాలను ఖండిస్తూ, సమస్యల సాధనకు చేపట్టిన కార్యక్రమంలో కార్మికులు పెద్ద ఎత్తున మద్దతు పలకాలని, 30న జరిగే ఛలో కొత్తగూడెం లో పాల్గొని ముట్టడి కార్యక్రమాని విజయవంతం చేయాలని, ఈ ఆందోళన కార్యక్రమ సెగ అసెంబ్లీ కి అంటుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, వీరభద్రయ్య , కలవేని శంకర్, మస్కె సమ్మయ్య, మిట్టపల్లి వెంకటస్వామి, చిప్ప నర్సయ్య, దాగం మల్లేష్, మీనుగు లక్ష్మీ నారాయణ, గొల్ల శ్రీనివాస్, ప్రజానాట్యమండలి కళాకారులు, కార్మికులు పాల్గొన్నారు.

## విద్యాలయ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

మండల కేంద్రంలో కొనసాగుతున్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం అకాడమిక్ బ్లాక్ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఈ క్రమంలో పాఠశాల అకాడమిక్ బ్లాక్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల హాజరు పట్టికలు, తరగతి గదులు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటితో పాటు నాణ్యమైన విద్య బోధన అందించాలని, పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. గ్రామంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, మురుగు కాలువల వ్యవస్థ, పారిశుద్ధ్యం సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. మండల కేంద్రంలోని నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్ లను సందర్శించి మొక్కలు నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సకాలంలో నీటిని అందించి మొక్కలను పరిరక్షించాలని తెలిపారు. ప్రతిరోజు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని, ఉపయోగకరమైన చెత్తను వేరుచేసి సెగ్రికేషన్ షెడ్లకు తరలించాలని తెలిపారు. ఈ అంశాల సమర్థవంతమైన నిర్వహణపై నిర్వాహకులను అభినందించారు. మండలంలోని చిత్తాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు సకాలంలో



పౌష్టికాహారం అందిస్తూ నాణ్యమైన విద్య బోధన చేయాలని, విద్యార్థుల ఆరోగ్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడుతూ సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి, మధ్యాహ్న భోజనం నాణ్యత, సౌకర్యాల కల్పన అంశాలపై వరాలు అడిగి తెలుసుకున్నారు. ఏకాగ్రతతో చదివి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని, ఉన్నత స్థాయికి ఎదిగే దిశగా ఏకాగ్రతతో కృషి చేయాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం తయారీ తీరును పరిశీలించి సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని, ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులు వినియోగించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించే విధంగా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి మొహమ్మద్ అబ్దుల్ హై, మండల పంచాయతీ అధికారి, పంచాయితీ కార్యదర్శి, సర్పంచ్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలను అద్భుతంగా జరిపించాలి

(మొదటి పేజీ తరువాయి)

భక్తుల సౌకర్యార్థం మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, వీఐపీలు కూడా హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు ముందస్తు ప్రణాళికతో వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ప్రదేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అందరూ కలిసి పనిచేస్తేనే ఈ శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతాయని, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్, డీసీపీ మరియు ఆలయ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# సమన్వయంతో బాలికలకు హెచ్.పి.వి వ్యాక్సిన్

(మొదటి పేజీ తరువాయి)

14 సంవత్సరాలు నిండిన బాలికలకు టీకాలు వేయించాలని సూచించారు. అర్హులందరి జాబితా సిద్ధం చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. నిర్దిష్ట సమయం తేదీల ప్రకారం వ్యాక్సినేషన్ చేయించాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాలు, అంగన్వాడి టీచర్లతో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎమినైజేషన్ అధికారి సాజిత, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, ఎస్సీ సంక్షేమ శాఖ డిడి నాగలేశ్వర్, ఆర్ ఎం ఓ నవీన తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బంది ఆరోగ్యం విషయంలో రాజీ పడబోం

(మొదటి పేజీ తరువాయి)

సమర్థవంతంగా పనిచేస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్ , రూరల్ ఏసీపీ విజయకుమార్ , ట్రాఫిక్ ఏసీపీ వెంకటస్వామి , రూరల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి తో పాటు ఎస్సై లు నరేష్ , లక్ష్మా రెడ్డి లతో పాటు ఇతర పోలీసు అధికారులు, పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి




గోదావరిఖని, మార్చి 20(మనం న్యూస్):రామగుండం వన్ ఏరియా పరిధిలోని జిడికె 11ఏ ఇంక్లైన్ భూగర్భ గనిలో ఒక రోజులో రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఆర్జీ వన్ జీఎం డి లలిత్ కుమార్ తెలిపారు. 2,916 టన్నులకు గాను 4,025 టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించి 138 శాతం నమోదు చేశారని, కంటిన్యూస్ మైనర్ తో అధిక ఉత్పత్తి సాధ్యమైందని, ఇది 2025-26 ఆర్థిక సంవత్సరములో సంస్థలోని అన్ని భూగర్భ గనులలో అత్యధిక రోజువారి ఉత్పత్తిగా నమోదైందని, సింగరేణి వ్యాప్తంగా 29 భూగర్భ గనుల్లో 11ఏ గని రికార్డు సృష్టించిందని అన్నారు. ఈ సందర్భంగా జీఎం జిడికె 11ఏ ఇంక్లైన్ గని అధికారులు, సూపర్వైజర్లు, ఉద్యోగులు, యూనియన్ నాయకులను ప్రత్యేకంగా అభినందించి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ... భూగర్భ గనిలో యంత్రాలు సుమారు 20 గంటల పాటు నిరంతరం పని చేయడంతోనే ఈ విజయం సాధించామని అన్నారు. కంటిన్యూస్ మైనర్ 2వ విభాగం 200 శాతం లక్ష్యాన్ని సాధించడం గొప్ప విశేషం అని తెలిపారు. ఈ సందర్భంగా మరమ్మత్తులు చేసిన జిడికె 11ఏ గని మేనేజర్ కార్యాలయంను ప్రత్యేక పూజ కార్యక్రమం చేసి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, గని ఏజెంట్ చిలుక శ్రీనివాస్, మేనేజర్ మల్లేశం, గ్రూఫ్ ఇంజనీర్ రాందాస్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ వేణు, రక్షణ అధికారి మల్లేష్, పిట్ ఇంజనీర్ రాకేష్, ఏఐటియుసి నాయకులు రంగు శ్రీను, పిట్ సెక్రటరి, నాయిని శంకర్, ఫ్రీ షిఫ్ట్ ఇంచార్జ్ క్రాంతి, సూపర్వైజర్ వేణు, ఆపరేటర్స్ శ్రీనివాస్, అశిష్, అశోక్, ప్రసాద్ అధికారులు ఉద్యోగులు, సూపర్ వైజర్, స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# మనం దినపత్రిక 2026 క్యాలెండర్ ఆవిష్కరణ




చిగురుమామిడి, మార్చి 20 (మనం న్యూస్): చిగురుమామిడి మండలంలోని సుందరగిరి గ్రామంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించిన అనంతరం మనం దినపత్రిక 2026 క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చొల్లేటి శంకరయ్య, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సుందరగిరి గ్రామ సర్పంచ్ జంగ శిరీష-వెంకటరమణారెడ్డి పాల్గొని క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, "మనం దినపత్రిక ప్రజల గొంతుకగా నిలుస్తూ, నిష్పక్షపాత వార్తలతో పాఠకుల హృదయాలను గెలుచుకుంటోంది" అని ప్రశంసించారు. ఆలయ పవిత్ర వాతావరణంలో క్యాలెండర్ ఆవిష్కరణ జరగడం శుభసూచకమని వారు పేర్కొన్నారు. కొద్ది కాలంలోనే మనం దినపత్రిక విశ్వసనీయతను సంపాదించి, మంచి పేరు ప్రఖ్యాతలు పొందిందని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రజలు మరియు ప్రభుత్వం మధ్య వారధిగా వ్యవహరిస్తూ, ప్రజా సమస్యలను నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ఈ పత్రిక అంకితభావంతో పనిచేస్తోందని వారు అభినందించారు. నిజాయితీతో, నిర్భయంగా వార్తలను అందించడంలో ముందంజలో నిలుస్తుందని కొనియాడారు. ఈ సందర్భంగా మనం దినపత్రిక యజమాన్యం, విలేకరులు, సిబ్బందికి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుందరగిరి ఆలయ అర్చకులు, ధర్మకర్తలు, గ్రామ పంచాయతీ సభ్యులు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాళ్లతో కూడిన అకాల వర్షం

**-పంటలపై తీవ్ర ప్రభావం**

**-సర్వే చేసి ఆదుకోవాలంటున్న రైతులు**

కాసిపేట, మార్చి20(మనంన్యూస్) అంతవరకు మామూలుగా ఉన్న వాతావరణం ఒక్కసారే మేఘావృతం కావడం, ఉరుములు లేవు, మెరుపులు లేవు, కాలం కానీ కాలంలో ఊహించని రీతిలో గాలులతో కూడిన కురిసిన రాళ్ల వాన తో ప్రజలు బెంబేలెత్తి పోయారు. యాసంగి లో అరకొరగా రైతులు సాగు చేసిన పంటలపై ఈ వాన తీవ్ర ప్రభావాన్ని చూపింది. కాసిపేట మండలంలో శుక్రవారం మధ్యాహ్నం సమయంలో రాళ్ళతో కురిసిన వాన ప్రజలను ఆశ్చర్యానికి, ఆందోళనకు గురిచేసింది. ఉదయం నుండి మామూలుగానే ఉన్న వాతావరణం ఒక్కసారే చల్లబడి, ముందుగా గాలులతో కూడిన రాళ్ళ వాన కురిసింది. దాదాపు పావుగంట కురిసిన రాళ్ళతో ఇంటి పరిసరాలు, రోడ్లు పై కనువిందు చేసింది. పిల్లలు రాళ్లను ఏరి వాటితో ఆడుకున్నారు. అటు తర్వాత ఓ మోస్తారు వర్షం కురియడంతో రాళ్ళు కరిగి పోవడం, చాలా ఏళ్లకు మండలంలో పడిన రాళ్ళ వానకు చిన్న పెద్ద ఒక వింత అనుభూతికి లోనయ్యారు. వర్షం తగ్గినాక నేను ఉన్నా అన్నట్టుగా అంతలోనే ఎండ తన ప్రతాపం మొదలు పెట్టింది.

**యాసంగి పంటలపై తీవ్ర ప్రభావం**

రాళ్ళతో కూడిన అకాల వర్షానికి యాసంగి లో రైతులు సాగు చేసిన పంటలపై తీవ్ర ప్రభావాన్ని చూపిందని రైతులు పేర్కొన్నారు. మండలంలోని సాగునీటి వసతులు, బోర్ల కింద రబీ లో రైతులు సుమారు 650 ఎకరాల్లో వరి పంట, 50 ఎకరాల్లో కంది, మరో వంద ఎకరాల్లో కూరగాయలు, ఇతర పంటలు సాగు చేసినట్టు సమాచారం. ఈ రాళ్ళ వర్షానికి పంటలు దెబ్బతిన్నాయని అంటున్నారు. మరో వైపు మండలంలో దాదాపు వంద ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఇటీవల కురిసిన వానలకు మామిడి పూత రాలి





దిగుబడులపై దిగాలుగా ఉన్న రైతులకు, రాళ్ళ వానకు పూత, పిందె నెలరాలి ఈ ఏడు పంట దిగుబడులపై ఆశలు వొదులు కావాల్సిందే, అని రైతులు అంటున్నారు. అట్లాగే ఇంటి పెరట్లో వున్న మామిడి, జామ, పనస, తదితర పండ్ల చెట్లు దెబ్బ తిన్నాయని రైతులు అంటున్నారు. రాళ్ళ వానతో పాటు ఇటీవల కురిసిన వానలకు పంటల నష్టం పై సర్వే చేసి ఆదుకోవాలని రైతులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. కాగా ఈ విషయమై మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ ను సంప్రదించగా, పంట నష్టం అంచనా కోసం సిబ్బందిని ఫీల్డ్ కు పంపించి వివరాలు సేకరిస్తామని, తదుపరి చర్యల నిమిత్తం పై అధికారులకు నివేదికలు అందిస్తామని అన్నారు.

# కోరుట్ల పబ్లిక్ స్కూల్ విద్యార్థిని నేమూరి నిత్యశ్రీకి నవోదయ పరీక్షలో 2వ ర్యాంక్



కోరుట్ల మార్చి 20 (మనం న్యూస్) : కోరుట్ల పబ్లిక్ స్కూల్ విద్యార్థిని నేమూరి నిత్యశ్రీ, జగిత్యాల జిల్లా స్థాయి జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలో ద్వితీయ స్థానం సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. నేమూరి సురేష్, సంధ్య దంపతుల కుమార్తె అయిన నిత్యశ్రీ, ఈ పరీక్షలో 96. 25 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో 2వ ర్యాంక్ సాదించి నవోదయ విద్యాలయంలో ప్రవేశం పొందింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ప్రిన్సిపల్ గుజ్జేటి వెంకటేష్ మాట్లాడుతూ, కెపిఎస్ లో అందిస్తున్న నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, ఉపాధ్యాయుల తల్లితండ్రుల ప్రోత్సాహం వల్లే ఇలాంటి అద్భుత ఫలితాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు. నిత్యశ్రీ విజయాన్ని పురస్కరించుకొని పాఠశాల యాజమాన్యం ఆమెను, ఆమె తల్లిదండ్రులను ఘనంగా సత్కరించి వె-ంమెంటో అందజేసారు. ఈ విజయం ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి అవకాశాలు




గోదావరిఖని, మార్చి 20(మనం న్యూస్):కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఎన్టీపీసి దీప్తి మహిళా సమితి (డిఎంఎస్) అధ్యక్షురాలు రాఖీ సమంత అన్నారు. వృత్తి శిక్షణా కేంద్రం భవనం-2లో జరిగిన కుట్టు శిక్షణ ముగింపు వేడుకల్లో ముఖ్య అతిథిగా రాఖీ సమంత పాల్గొని సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా డిఎంఎస్ అధ్యక్షురాలు మాట్లాడుతూ... మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు నైపుణ్యాలు పెంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంఎస్ సభ్యులు, హెచ్ఆర్ సిఎస్ఆర్ బృందం పాల్గొన్నారు.

# ముగిసిన వాలిబాల్ క్రీడా పోటీలు

కాసిపేట, మార్చి 20(మనంన్యూస్)కాసిపేట మండలం గిరిజన గ్రామం పెద్దాపూర్ లో ఆదివాసి కొలామ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన, కొలం క్రీడాకారుల జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు శుక్రవారం ముగిసాయి. కొమురంభీం జిల్లా యాపల్వాడ్ మండల టీం,మండలంలోని పెద్దాపూర్ టీమ్ లు తలపడ్డాయి. ఈ పోటీల్లో యాపల్వాడ్ జట్టు విజయం సాధించి రూ, 5 వేలు, రెండవ స్థానంలో పెద్దాపూర్ జట్టు నిలిచి రూ,3 వేలు నగదు బహుమతులు అందుకున్నారు. దేవాపూర్ సర్పంచ్ సిడాం రాందాస్, కోలాం సేవా సంఘం జిల్లా అధ్యక్షులు ఆత్రం మహేష్ చేతుల మీదుగా విజేత జట్లకు అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనసూయ గూడెం పటేళ్ల టెకం మెంగు, భీమ్ రావు,బొజ్జిరావు,భగవంత్ రావు రాజు వార్డు సభ్యులు సతీష్,పాండు, నాయకులు, క్రీడాకారులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా ప్రధాన కార్యదర్శిగా వేముల

**-అంచెలంచెలుగా ఎదిగొచ్చిన కృష్ణ**



కాసిపేట, మార్చి 20(మనంన్యూస్)విద్యార్థి దశ లో ఎన్ఎస్ యుఐ లో , అటు తర్వాత కాంగ్రెస్ క్రియాశీల రాజకీయాల్లో చురుకైన పాత్ర వహించిన, కాసిపేట మండలం సోమగూడెం గ్రామానికి చెందిన, మాజీ సర్పంచ్ వేముల కృష్ణ ను, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరించడం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మంచిర్యాల ఎమ్మెల్యే కే ప్రేమ్ సాగర్ రావు వర్గీయులుగా ఉన్న కృష్ణ, 1997 లో ఎన్ఎస్ యుఐ మండల అధ్యక్షులుగా, 2001 లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి గా,2003 నుండి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా 2008 నుండి యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా,2011 లో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శిగా 2014 ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శిగా,2017 లో మంచిర్యాల జిల్లా కార్యదర్శిగా,2021 లో బోథ్ అసెంబ్లీ ఎల్డీఎమ్ కో ఆర్డినేటర్ గా. 2024 లో మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నిక కాబడి పార్టీ అభివృద్ధికి, ప్రభుత్వ పథకాలు, ప్రజల్లోకి తీసుకెళ్తూ మంచి నాయకులుగా గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రజల ఆశీస్సులతో 2019 నుండి పెద్దనపల్లి పంచాయతీ సర్పంచ్ గా పూర్తి కాలం ఉండి సేవలు అందించారు. పార్టీ పట్ల నిబద్ధత, పై నాయకత్వం ఆదేశాల మేరకు పని చేస్తూ వారి మన్ననలు పొందరు. సుదీర్ఘకాలం పార్టీకి చేసిన సేవలను గుర్తించిన పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి గా నియామకం చేయడం, సహకరించిన ఎమ్మెల్యే లు ప్రేమ్ సాగర్ రావు, జీ వినోద్ వెంకటస్వామి , మాజీ డిసిసి అధ్యక్షులు కే సురేఖ, పార్టీ జిల్లా అధ్యక్షులు రఘునాథ రెడ్డి,ఓసిసి యూనియన్ అధ్యక్షులు కే సత్యపాల రావుకు కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నట్టు కృష్ణ వెల్లడించారు. మరింత బాధ్యతతో పార్టీ అభివృద్ధికి పాటుపడతానని ఆయన తెలియచేశారు.

# ఎంపీ అరవింద్ నిధులతో దీక్షా స్వాముల నిలయానికి ఘనంగా భూమిపూజ

కోరుట్ల, మార్చి 20 (మనం న్యూస్) : మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో హనుమాన్ ఆలయం ప్రక్కన దీక్షా స్వాముల కోసం నిర్మించనున్న నిలయానికి శు క్రవారం ఘనంగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ నిర్మాణానికి పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ మంజూరు చేసిన ఎంపీ ఫండ్ నుంచి రూ. 3 లక్షల నిధులతో పనులకు శ్రీకారం చుట్టడం విశేషం. గత సంవత్సరం జూలై 26న ఎంపీ అరవింద్ ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయగా, ఆ మేరకు గ్రామ ప్రజల దీర్ఘకాల కోరిక నెరవేరే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రౌట్ల స్రవంతి--శ్రీకాంత్, ఉపసర్పంచ్ అరుణ్ రావు, దీక్షా స్వాములు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, ఎంపీ అరవింద్ ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధికి పలు పనులు జరుగుతున్నాయని, దీక్షా స్వాముల నిలయం నిర్మాణం కూడా అదే దిశలో ఒక ముఖ్యమైన ముందడుగు అని పేర్కొన్నారు. అవసరమైతే మరిన్ని నిధులు కూడా ఎంపీ దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆలయపూజారి శ్రీ మరింగంటి శ్రీవాత్సవ అతిథులకు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో, డాక్టర్ వై అనూప్ రావు, మండల అధ్యక్షుడు పంచిరి విజయ్, జిల్లా బీజేపీ కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాస్, జిల్లా ఉ పాధ్యక్షుడు గుల్లిల్ల తుక్కారం గౌడ్, రాష్ట్ర బి.జె.వై.ఎం యువ మోర్చా అధ్యక్షుడు దొణికెల నవీన్, పార్లమెంటు కో కన్వీనర్ గుంటుక సదాశివ, బీజేపీ బూతు అధ్యక్షులు వెంకటేశ్, ప్రశాంత్, మాజీ ఉపసర్పంచ్ గంగనర్సయ్య, నాయకులు తోట లింగారెడ్డి, యాదగిరి శ్రీనివాసరావు, వెంకటాపూర్, గుమ్లాపూర్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, దీక్షా స్వాములు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ప్రేమ పెళ్లిళ్ల పేరుతో నయవంచనకు పాల్పడుతున్న యువత

**అమ్మాయిలను వాడుకోవడం అనంతరం డబ్బుల కోసం ప్రాణాలు తీయడం సమాజాన్ని కలచివేసే ఘటన**

**యూట్యూబర్ వైష్ణవి (20) నాలుగు నెలల గర్భిణీ హత్య కేసులో ముగ్గురి అరెస్టు**

**హంత కుడిని మాకు అప్పజెప్పండి లేదా తక్షణమే ఉరి తీయండి.. ఉగాది పండుగ వేళ కుటుంబ సభ్యుల ఆందోళన రాస్తారోకో**



కోరుట్ల మార్చి 20 (మనం న్యూస్) : జగిత్యాల జిల్లా, కోరుట్ల మండలం, మాదాపూర్ గ్రామానికి చెందిన గంధం వైష్ణవి నాలుగు నెలల గర్భిణీ (20) హత్య కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. వైష్ణవి హత్య చేసిన నిందితుడిని మాకు అప్పగించండి లేదా తక్షణమే తీయండి అంటూ కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ధర్నా రాస్తారోకో నిర్వహించారు అనంతరం పోలీసులు కేసు నమోదు చేశాము అన్ని రకాల చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విరమించారు. ఇప్పటికే ఈ ఘటనలో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న భర్త చిత్తారి హరిబాబు పై కేసు నమోదైన నేపథ్యంలో, మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.దర్యాప్తులో భాగంగా, కట్నం కోసం వైష్ణవిని మానసికంగా, శారీరకంగా వేధించినట్లు తెలిసిన హరిబాబు కుటుంబ సభ్యుల పాత్ర కూడా బయటపడింది. ఈ క్రమంలో నిందితుడి తల్లి చిత్తారి లక్ష్మి, అన్నలు చిత్తారి ఆనంద్, చిత్తారి అశోక్‌లపై కట్న వేధింపులు హత్యకు ప్రేరేపించిన ఆరోపణలతో కేసు నమోదు చేశారు.పోలీసులు చేపట్టిన దర్యాప్తులో భాగంగా, ఈ ముగ్గురిని గురువారం మార్చి 19, 2026 న అరెస్ట్ చేశారు. అనంతరం వారిని డిఎస్పి రాములు ఎదుట హాజరుపరచగా, న్యాయస్థానంలో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు ఈ ఘటనపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.అన్నలు ఆనంద్, అశోక్ కూడా ప్రేరేపించినట్లు ఆరోపించారు. సుమారు 4 నెలల క్రితం వైష్ణవి గర్భవతిగా ఉన్ననాటి నుండి ఎక్కువగా వేధింపులు కొనసాగినట్లు వెల్లడించారు.మార్చి 16 రాత్రి 11 గంటల సమయంలో వైష్ణవి, హరిబాబు గదిలో నిద్రకు వెళ్లగా, తెల్లవారుజామున 4 గంటల సమయంలో శబ్దాలు వినిపించాయని, తలుపు తట్టినా తీయకపోవడంతో తిరిగి వెళ్లిపోయినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం హరిబాబు తన భార్యను నిద్రలో ఉండగానే కత్తితో దాడి చేసి, గొంతు నులిమి హత్య చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

మార్చి 17 ఉదయం 6 గంటల సమయంలో హరిబాబు ఒంటరిగా బయటకు వచ్చి, ముఖం కడిగి తన బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్‌పై ఎవరికి తెలియకుండా వెళ్లిపోయాడు. తర్వాత గది తలుపు తెరిచి చూడగా వైష్ణవి రక్తపు మడుగులో పడివుండగా, నుదిటిపై గాయాలు, మెడపై గుర్తులు కనిపించాయి. వెంటనే ఆమెను ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, కోరుట్లకు తరలించగా, వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు ప్రకటించారు.హత్య అనంతరం హరిబాబు రాయికల్--మైతాపూర్ ప్రాంతాల్లో తిరుగుతూ, కొనరావుపేట ఎక్స్ రోడ్ సమీపంలోని ఖాళీ డబుల్ బెడ్‌రూమ్ ఇంటి మెట్ల కింద కత్తి, రక్తపు మచ్చలున్న దుస్తులను దాచిపెట్టినట్లు పోలీసులు గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు అదే రోజు సాయంత్రం 6:30 గంటలకు నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నిందితుడి ఒప్పంద ప్రకటన ఆధారంగా పంచుల సమక్షంలో రికవరీ పంచనామా నిర్వహించి, బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్, రక్తపు మచ్చలున్న కత్తి, నీలం రంగు జీన్స్ ప్యాంట్, నీలం రంగు టీ-షర్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రేమ పెళ్లి చేసుకున్న అమ్మాయిల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యే అవకాశాలున్నాయి. మన ఆడపిల్లల పట్ల తగినంత జాగ్రత్తగా ఉండాలని కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ సురేష్ బాబు, సబ్ ఇన్స్పెక్టర్ చిరంజీవి, పోలీసులు సూచిస్తున్నారు.ఈ కేసు దర్యాప్తు కొనసాగుతుండగా, మిగతా నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్‌డీపీఓ మెట్పల్లి ఏ. రాములు, కోరుట్ల సిఐ బి సురేష్ బాబు, ఎస్సై చిరంజీవి తెలిపారు.





# ఉగాది సందర్భంగా ప్రజలకు ఉగాది పచ్చడి బూరెలు పంపిణీ చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులు

**-ప్రతి సంవత్సరం ఈ విధంగా పంపిణీ చేయడం అదృష్టంగా భావిస్తున్నాం.**

**-తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు ఓరుగంటి భార్గవ్**

జగిత్యాల మార్చి 20 (మనం న్యూస్) : ప్రతి సంవత్సరం ఉగాది రోజున తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి బూరెలు పంపిణీ చేయడం మేము అదృష్టంగా భావిస్తున్నాం అన్నారు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు ఓరుగంటి భార్గవ్. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలో గల టవర్ సర్కిల్ ప్రాంతంలో ఉగాది పండుగను పురస్కరించుకొని ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ ఉగాది పచ్చడి మరియు బూరెలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా ఓరుగంటి భార్గవ్ మాట్లాడుతూ జగిత్యాల చరిత్రలోనే తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాల నుండి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వర్తిస్తున్నాం. అన్న స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి ఆశీస్సులతో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలుగా గర్విస్తున్నాను, అన్న ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని బడుగు బలహీన దళిత వర్గాల వారి కోసం స్థాపించి రాజ్య స్థాపనే ముఖ్యంగా ఆలోచించి బీసీ, ఎస్సీ ,ఎస్టీ ,మైనారిటీ వర్గాల వారిని అత్యున్నతమైన పదవులలో నిలిపిన మహోన్నత నాయకుడు ఎన్టీఆర్ గారు. ప్రజలకు రెండు రూపాయల కిలో బియ్యం అందించి, సగం ధరకే జనతా వస్త్రాలు అందించినారు ,50 రూపాయలకే హార్స్ పవర్ కరెంటు వ్యవసాయదారులకు అందించినాడు, మహిళలకు ఆస్తిలో హక్కు, మహిళలకు రాజకీయంగా రిజర్వేషన్లు కల్పించినాడు. విద్య వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చి, దళిత బడుగు బలహీన వర్గాలు విద్యావంతులు కావడానికి కృషి చేసినాడు. రాష్ట్రంలో గురుకుల పాఠశాలు, మండలం వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు తమ ముంగిటనే ప్రజా పరిపాలన చూపించినారు, ప్రతి గ్రామంలో ప్రజలకు సురక్షితమైన మంచినీరు అందించడానికి బావులు తవ్వించి వాటర్ ట్యాంకులు నిర్మించినాడు, ప్రతి ఊరుకు పాఠశాలలు నిర్మించారు ,ప్రతి మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించి ప్రజలకు ఆరోగ్య సేవలు అందించినాడు, ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో మంచి కార్యక్రమాలు చేసి ప్రజల మనసుల్లో ఒక అన్నగా స్వర్గీయ ఎన్టీ రామారావు గారు సుస్థిరమైన స్థానాన్ని నిలుపుకున్నారు ,ఆయనను ఆదర్శంగా తీసుకొని మేము నాయకులుగా ఎదిగినాము, నేటికీ ఆయన పేరు జపిస్తూ ఉంటున్నాం . అలాగే నారా చంద్రబాబునాయుడు గారు ముఖ్యమంత్రి అయిన పిదప ఆంధ్రప్రదేశ్ ను సాఫ్ట్ వేర్ రంగంలో ప్రపంచ స్థాయిలో గుర్తింపు కలిగిందంటే అది సిబిఎన్ గారి చొరవ తోటే తెలంగాణ అభివృద్ధి జరిగింది. 2028 సంవత్సరంలో తెలంగాణలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుంది అని తెలియజేశారు తెలంగాణ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ఓరగంటి భార్గవ రామ్. ఈ కార్యక్రమంలో సోమనారాయణరెడ్డి నిజాంబాద్ పార్లమెంటు కమిటీ మెంబర్, కొండ శ్రీధర్ జగిత్యాల పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జున్ను మల్లయ్య ,భక్తుల కొండయ్య యాదవ్ ,ఉప్పుల రవి, ఉప్పుల రామకృష్ణయ్య, కందుకూరి తిరుపతి ,జలంధర్ రెడ్డి ,నక్క లక్ష్మణ్ ,కాశీనాదం కొయ్య బాలకృష్ణ, మగ్గిడి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



# సహజ వనరుల యాజమాన్య నిర్వహణ



జైపూర్, మార్చి 20(మనం న్యూస్): జైపూర్ మండల పరిధిలోని పంచాయతీల్లో 99 యాక్షన్ ప్లాన్ నేపథ్యంలో సహజ వనరుల యాజమాన్య కార్యక్రమాన్నీ శుక్రవారం అధికారులు కొనసాగించారు. ముదిగుంటలో ఉపాధి హామీ పథకం ద్వారా వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు, సామూహిక ఇంకుడు గుంతలు, వ్యక్తిగత ఇంకుడు గుంతల పనులను డి ఆర్ డి ఏ కిషన్ పరిశీలించారు. సర్పంచ్ రాజకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ఐకెపి మహిళా సభ్యులంతా పాల్గొని భూగర్భ జలాలను పెంచే దిశగా ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మాణం చేపడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డి ఆర్ డి ఏ కిషన్ మాట్లాడుతూ మురుగునీటి నిర్వహణలో ఇంకుడు గుంతల ఆవశ్యకతను తెలిపి, వాటి ద్వారా పరిశుభ్రతను పెంచవచ్చు అన్నారు. వర్షం పడినప్పుడు ఆ నీరు వృధా పోకుండా పైకప్పులు, భూమి ఉపరితలం నుండి సేకరించి, భూగర్భంలోకి ఇంకిపోయేలా చేసి భూగర్భ జలాలను పెంచవచ్చునన్నారు. నీటిని పొదుపుగా వాడుకొని పర్యావరణ పరిరక్షణకు ఇవి అత్యంత అవసరమైన పద్ధతులని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీఓ శ్రీపతి బాబురావు, ఏపీవో బాలయ్య, కార్యదర్శి సురేష్, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అభయ హనుమాన్ దేవాలయంలో ఆంజనేయస్వామికి ఊరేగింపు



కోరుట్ల మార్చి 20 (మనం న్యూస్) : కోరుట్ల నియోజకవర్గం పట్టణంలో వేములవాడ రోడ్డు పక్కన దేవాలయంలో అభయ హనుమాన్ దేవాలయం ఆధ్వర్యంలో అభయాస్తాన్ దేవాలయం ఆంజనేయ స్వామి మూల విరాట్ తో స్వామిజి ఊరేగింపు నిర్వహించారు. అభయ హనుమాన్ఆంజనేయ స్వామి దేవాలయం కమిటీ వారి ఆధ్వర్యంలో ఈరోజున దేవాలయం నుండి కార్గిల్ చౌక్ వరకు ఊరేగింపు నిర్వహించారు. మాల ధారణ స్వాములతో జైశ్రీరామ్ జైశ్రీరామ్ అంటూ ఆంజనేయ స్వామి భక్తి పాటలతో భజన జై శ్రీరామ్ జై శ్రీరామ్ అంటూ రామ రామ అంటూ భక్తి శ్రద్ధలతో గీతాలతో జై శ్రీరామ్ అంటూ భక్తిని చాటుకున్నారు.

# జ్ఞాపికలు అందించిన ఉపసర్పంచ్‌కి ఘన సన్మానం



మేడిపల్లి, ఫిబ్రవరి 20 (మనం న్యూస్): జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం లోని కల్వకోట గ్రామంలో నిర్వహించిన మండల ప్రైమరీ స్కూల్ కాంప్లెక్స్ స్థాయి స్కూల్ మీట్ కార్యక్రమం ఫిబ్రవరి 27 న నిర్వహించిన కార్యక్రమానికి గ్రామ ఉప సర్పంచ్ ఆదే రవితేజ ముఖ్య సహకారం అందిస్తూ విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో మూమెంటోలు స్పాన్సర్ చేశారు. విద్యా రంగానికి ఆయన అందించిన సేవలను గుర్తిస్తూ ఆయనను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎం.పి.పి.ఎస్ హెడ్ మాస్టర్ సురేందర్, జడ్‌పిహెచ్ఎస్ హెడ్ మాస్టర్ త్రిలోచన్ రెడ్డిలు కలిసి ఉప సర్పంచ్ ఆదే రవితేజని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థుల ప్రతిభను వెలికితీయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి సహకరించడం అభినందనీయమని, పేర్కొన్నారు. విద్యార్థులు కూడా తమకు అందించిన ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని విద్యా అభివృద్ధికి ఉప సర్పంచ్ ఆదే రవితేజ సహకారం ఆదర్శప్రాయమని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రవెల్లిలో రంజాన్ తోఫా పంపిణీ

బెల్లంపల్లి, మార్చ్ 20, (మనం న్యూస్ ) : బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామంలో శుక్రవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు సర్పంచ్ చిలుముల శ్రీనివాస్ ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్లను అందజేశారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ గజెల్లి రాజ్ కుమార్, వార్డు సభ్యుడు రంగ నాగరాజు, నాయకులు దామోదర్ గౌడ్, రియాజ్, పూదరి గణేష్ గౌడ్, కళ్యాణం శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల్లో పశు వైద్య శిబిరం



కాసిపేట, మార్చి 20(మనంన్యూస్)కాసిపేట మండలంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నేపథ్యంలో గ్రామాల్లో పశువైద్య, పశు సంవర్ధక శాఖ ఆద్వర్యంలో వైద్య శిబిరం కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో కాసిపేట మండలం లోని తాటిగూడ, మల్కేపల్లి గ్రామ పంచాయతీ కేంద్రాల్లో శుక్రవారం పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయా పంచాయతీల సర్పంచ్ లు మడావి వెంకటేశ్, కొట్నాక రఘుపతి లు రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించగా, పశు వైద్యురాలు సరిత, పశువులకు సోకే  గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు సరిత మాట్లాడుతూ, వ్యాధి సోకిన పశువులు నడవలేవు పాలు తగ్గుతాయని గుర్తించిన వాటి యజమానులు వెంటనే టీకాలు వేయించాలని సూచించారు. ఏడాది లో రెండు సార్లు తప్పకుండా పశువులకు టీకా వేయించాలని, దాంతో రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటాయని రైతులకు తెలియచేశారు. గ్రామాల్లో జరిగే వైద్య శిబిరాలను పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పంచాయతీల ఉప సర్పంచ్ లు విజయ లక్ష్మీ శేఖర్, సందీప్, వార్డు సభ్యులు,వైద్య సిబ్బంది సంతోష్, రవీందర్,గోపాల మిత్ర శ్యాం, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# కోరుట్ల పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా కస్తూరి లక్ష్మీనారాయణ

కోరుట్ల మార్చి 20 (మనం న్యూస్) :  కోరుట్ల పట్టణంలోని కోరుట్ల నియోజకవర్గ నాయకులు డా, అనూప్ రావు  నివాసంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా 11 వ వార్డ్ కౌన్సిలర్ కస్తూరి లక్ష్మీ నారాయణ ను నియమించారు.  జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు  డా, అనూప్ రావు రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు రుద్ర శ్రీనివాస్ లు  లక్ష్మీనారాయణకి అధ్యక్షుడి నియామక పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోరుట్ల పట్టణంలో ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని మున్సిపల్ లో బీజేపీ గొంతు బలంగా వినిపించాలని ఆదేశించారు, కస్తూరి లక్ష్మీ నారాయణ మాట్లాడుతు నాపై నమ్మకం ఉంచి నన్ను పట్టణ అధ్యక్షుడిగా నియమించిన ఇందూరు పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్, కి జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు, కి అనూప్ రావు, రుద్ర శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలియ చేస్తూ కోరుట్ల పట్టణంలో ప్రతి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతానని ప్రతి ఒక్క కార్యకర్తని నాయకున్ని కలుపుకొని పని చేస్తానని చెప్పారు, ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ 27 వ వార్డు కౌన్సిలర్ తిరుమల వాసు, మెట్పల్లి పట్టణ 26 వార్డు కౌన్సిలర్  పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్, పార్లమెంట్ కో కన్వీనర్ గుంటుక సదాశివ్ పట్టణ ప్రధాన కార్యదర్శులు చెట్లపెల్లి సాగర్, ఎర్ర రాజేందర్,  బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధోనికెల నవీన్ మెట్పల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి సంకట విజయ్ బీజేవైఎం పట్టణ ఉపాధ్యక్షులు రాగం శెట్టి సాయి కృష్ణ, సీనియర్ నాయకులు తులసి కృష్ణ, బెక్కం అశోక్, రాధారాపు సత్యనారాయణ, బీజేవైఎం నాయకులు ప్రేమ్ సాగర్, రాహుల్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బిజెపి ఆధ్వర్యంలో వద్ద ధర్నా




నస్పూర్, మార్చి 20 (మనం న్యూస్):బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు గారి పిలుపుమేరకు ఈరోజు మంచిర్యాల జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం వద్ద భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ గారి ఆధ్వర్యంలో ధర్నా మరియు ముట్టడి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ గారు మాట్లాడుతూ.... రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిపోయిన కూడా ఇప్పటివరకు ఎన్నికల్లో ఇచ్చినటువంటి హామీలను పూర్తిగా అమలు చేయలేదని ఆయన విమర్శించారు. 6 గ్యారంటీలు 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నయవంచనకు గురిచేసిందని మండిపడ్డారు. ఇల్లు లేని నిరుపేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. అక్కడక్కడ కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే ఇల్లు కేటాయించి నిజమైన అర్హులకు అన్యాయం చేశారన్నారు. కమిషన్ల కోసం ఇందిరమ్మ ఇల్లు కాంగ్రెస్ నాయకులు అమ్ముకుంటున్నారని, బెల్లంపల్లి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల విషయంలో జరిగినటువంటి అవకతవకల మీద కోర్టు స్టే తెచ్చుకోవాల్సినటువంటి పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు.ఈ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఒక్క వృద్యాప పించను గాని వితంతు పింఛను గాని నూతనంగా మంజూరు చేసింది లేదని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఆడబిడ్డలకు ఇస్తామన్న స్కూటీల ఊసే లేదన్నారు. గత పంచాయతీ ఎన్నికల సమయంలో రైతులకు రైతుబంధు ఇస్తామని హామీ ఇచ్చి ఇవ్వకుండా రైతులను మోసం చేసి ఎన్నికల్లో లబ్ధి పొందారని ఆయన అన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో కేవలం బిజెపి ఎమ్మెల్యేలు ప్రశ్నిస్తారని ఉద్దేశంతో రైతుబంధు ఇస్తామని ప్రకటించడం రైతులను దగా చేయడం కోసమే అని ఆయన పేర్కొన్నారు. మంచిర్యాల మార్కెట్ రోడ్ లో రోడ్డు వెడల్పు పేరుతో అభివృద్ధి పేరుతో ఇష్టా రీతిన ఇళ్లను షాపులను కూల్చివేయడం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు. ఎన్నికల్లో బిజెపికి ఓటు వేసారని ఉద్దేశంతోనే ఈరోజు కక్షపూరితంగా కూల్చివేతలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కొంతమంది అధికారులు కూడా కాంగ్రెస్ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని పద్ధతి మార్చుకోవాలని ఆయన హితవు పలికారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని సుస్థిరమైన పాలన అందించి అవినీతి అధికారులపై చర్యలు తీసుకునే విధంగా పరిపాలన ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే అమరాజుల శ్రీదేవి, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ గాజుల ముఖేష్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి, మరియు జిల్లా ప్రధాన కార్యదర్శులు దుర్గం అశోక్ , వంగపల్లి వెంకటేశ్వరరావు, ఎనగందుల కృష్ణమూర్తి జిల్లా ఉపాధ్యక్షులు అక్కల రమేష్, పట్టి వెంకటకృష్ణ, కోడి రమేష్, కమలాకర్ రావు, జోగుల శ్రీదేవి, ముత్తె సత్తయ్య గార్లు మరియు జిల్లా కార్యదర్శులు రాచర్ల సంతోష్, వైద్య శ్రీధర్, మహేందర్ గౌడ్, మంత్రి సురేఖ రామయ్య, ఠాకూర్ శైలేందర్ ఉదయశ్రీ, గార్లు మరియు మండల అధ్యక్షులు, అమీరిశెట్టి రాజు కుమార్, కుర్రె చక్రవర్తి, రంగా శ్రీశైలం, సత్రం రమేష్ మరియు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ కార్పొరేటర్లు కస్తూరి నాగరాజు, బోట్ల అనిత సత్యం గార్లు మరియు బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయురాలికి సన్మానం



దండేపల్లి మార్చి 20 (మనం న్యూస్) : మండలంలోని దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తు మండలం నుండి ఉపాధ్యాయ సంఘం పిఆర్టియు టిఎస్ రాష్ట్ర మహిళా అసోసియేట్ అధ్యక్షురాలుగా పనిచే సే ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయురాలు వరలక్ష్మికి మండల పిఆర్టియు టీఎస్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష కార్యదర్శులు రావణవేణి రవి, మల్యాల మల్లేష్ మాట్లాడారు.. ఇటు ఉపాధ్యాయురాలుగా, అటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటం చేసారని అన్నారు. మండల, జిల్లా, రాష్ట్ర బాధ్యతలను చేపట్టి సంఘానికి సేవ చేయడంలో సంఘం బలోపేతానికి ఎంతగానో కృషి చేశారని వారు అన్నారు.సంఘం జిల్లా బాధ్యులు కర్నే నరేందర్, మల్లారీ వినోద్, యాగండ్ల గంగన్న, పోలంపల్లి రామరాజు, శ్రీనివాస్, ముత్తినేని రమేష్, మందమర్రి మండలం అధ్యక్షులు నిచ్చకోల మహేశ్వర్, ఉపాధ్యాయులు  పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి



జమ్మికుంట, మార్చి 20 (మనం న్యూస్): కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక చట్టాలు తెచ్చి దేశ సంపదను కార్పొరేట్లకు, బహుళ జాతి సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ఆరోపించారు. జమ్మికుంట పార్టీ కార్యాలయంలో శుక్రవారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విత్తన, విద్యుత్ చట్టాలు తెచ్చిందని, బహుళ జాతి సంస్థల ఉపయోగపడే విధంగా చట్టం రూపొందించారన్నారు. రైతాంగాన్ని భూమి నుండి వేరు చేసే కుయుక్తులు పన్నుతుందన్నారు. స్వాతంత్రానికి పూర్వం కార్మిక వర్గం పోరాడి సాధించిన 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందని ఇది కార్మిక వర్గాన్ని మరింత కట్టు బానిసలుగా చేసే చట్టాలే అన్నారు. మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి విబిజి రాంజీ చట్టాన్ని తెచ్చారని ఇది ముమ్మాటికి వ్యవసాయ కూలీల కడుపు కొట్టి చట్టమన్నారు. యధావిధిగా పాత చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ దేశభక్తి పేరుతో కులాల మధ్య,మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయ పబ్బం గడుపుకుంటుందన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని హామీలు కొన్ని నెరవేర్చినప్పటికీ మిగతావి నెరవేర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. మహిళలకు నెలకు 2,500, నిరుద్యోగ భృతి, అన్ని పంటలకు బోనస్ బోగస్కానే ఉదన్నారు. కష్టజీవులు,కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 24న జిల్లా కలెక్టరేట్ ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎక్కడికి అక్కడ స్థానిక సమస్యలపై ఆందోళన పోరాటాలు నిర్వహించాలన్నారు. భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని ప్రతి పార్టీ శాఖ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాలు, సెమినార్లు, నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు కొప్పుల శంకర్, మండల కమిటీ సభ్యులు దండిగారి సతీష్, బాసిర సంపత్ రావు, వడ్లూరి కిషోర్, బైరం సమ్మయ్య, రాచపల్లి తిరుపతి, గడ్డం శోభన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# టిబి నిర్మూలన లక్ష్యంగా తాండూరులో వైద్య శిబిరం



తాండూర్ మార్చ్ 20 (మనం న్యూస్ ) : తాండూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం "టిబి ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమం భాగంగా నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్లు డా. జాన్సీరాణి, డా. లక్ష్మి ప్రసన్న ప్రజలతో నేరుగా మమేకమై క్షయవ్యాధి, హెచ్ఐవి పై సమగ్ర అవగాహన కల్పించారు. రెండు వారాలకు పైగా దగ్గు కొనసాగితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో తెమడ పరీక్షలు, ఎక్స్‌రేలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. క్షయవ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచిత చికిత్సతో పాటు ప్రతినెల రూ.1000 పోషణ భత్యం ప్రభుత్వం అందిస్తున్నట్లు వివరించారు.

శరీర రోగనిరోధక శక్తిని పెంపొందించేందుకు పోషకాహారం తీసుకోవడం అత్యంత అవసరమని, వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నియంత్రించవచ్చని వైద్యులు స్పష్టం చేశారు. దగ్గు తుంపర్ల ద్వారా వ్యాపించే ఈ వ్యాధి మద్యం, పొగాకు వినియోగదారుల్లో ఎక్కువగా కనిపిస్తుందని హెచ్చరించారు. ఈ శిబిరంలో 21 మందికి తెమడ పరీక్షలు, 84 మందికి పోర్టబుల్ ఎక్స్‌రే యంత్రం ద్వారా ఎక్స్‌రేలు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ సురేష్ ఉపసర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ మాస్క్ వినియోగం, శుభ్రత, పోషకాహారం ఇవే టిబి నివారణకు మూడు బలమైన ఆయుధాలు""ఒక్కరి నిర్లక్ష్యం సమాజానికి ప్రమాదం అందరి జాగ్రత్తే ఆరోగ్యకరమైన గ్రామానికి పునాది అని అవగాహన పెంచుకుందాం టిబిని జయిద్దాం ఆరోగ్యవంతమైన భవిష్యత్తు నిర్మిద్దాం"గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషించిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పుట్ట సత్తయ్య, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీనివాస్, డివిజన్ టిబి సూపర్వైజర్ శ్రీపెల్లి శశికాంత్, ఐసిటిసి కౌన్సిలర్ జగన్మోహన్, హెల్త్ సూపర్వైజర్లు పద్మ, తార, రమాదేవి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏ ఎన్ ఎమ్ లు తిరుపతమ్మ, శ్రీలత, ల్యాబ్ టెక్నీషియన్లు హాకీం, యాదవ్, దేవదాస్, ఎక్స్‌రే టెక్నీషియన్ పవన్, ఆశా కార్యకర్తలు కవిత, రేవతి, భారతి, రాజేశ్వరి, భాగ్య, మమత, రోజ తదితరులు పాల్గొని సేవలందించారు.

# మల్లేష్ కళ్ళు సజీవం





బెల్లంపల్లి, మార్చ్ 20, (మనం న్యూస్ ) : బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామానికి చెందిన అయిల్ల మల్లేష్ 55 ఏళ్ల వయసులో గుండెపోటుతో మరణించాడు. మల్లేష్ బావమ్మర్ది గోడిశెల శేఖర్ నేత్రదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడంతో భార్య పద్మ, కుమారుడు సాయితేజ, కూతుర్లు ప్రీతి, ప్రియాంక నేత్రదానానికి అంగీకరించారు. సదాశయ ఫౌండేషన్ సహకారంతో ఎల్వి ప్రసాద్ ఐ బ్యాంకు సిబ్బంది ప్రదీప్ నేత్రాలను స్వీకరించారు. ఎల్వి ప్రసాద్ ఐ బ్యాంకు వారు నేత్రదాన సర్టిఫికెట్ అందజేశారు. ఈసందర్భంగా జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ జనహిత సేవాసమితి ద్వారా నేత్రదానం చేయించడం ఇది 13వ సారి అన్నారు. ప్రజలందరూ అపోహలు వీడి నేత్ర, అవయవ, శరీర దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జనహిత సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఇప్ప రవి, సహాయ కార్యదర్శి గోడిశెల శేఖర్, గుమ్ముల చందు, బిమిని కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# మరణాన్ని గెలిచిన మానవత్వం



బెల్లంపల్లి,మార్చి20,(మనం న్యూస్) : ప్రకృతి కన్నెర్ర చేసిందో ఏమో ఒక నిండు ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోయింది. బెల్లంపల్లి సుభాష్ నగర్ బస్తీకి చెందిన లింగంపల్లి వర్షిత అకాల మరణం ఆ ఇంటి దీపాన్ని ఆర్పేసింది. కన్నవారి కడుపుకోత, బంధుమిత్రుల కన్నీటి పర్యంతం మధ్య ఆ ఇల్లు విషాద సముద్రాన్ని తలపిస్తోంది. కానీ, ఆ పుట్టెడు దుఃఖంలోనూ ఆ కుటుంబం చూపిన ధైర్యం, చాటుకున్న మానవత్వం మరణాన్ని కూడా ఓడించింది.

**కన్నుమూసినా.. చూపునిచ్చింది**

తమ బిడ్డ ఇక లేదన్న చేదు నిజాన్ని జీర్ణించుకోవడం ఆ తల్లిదండ్రులకు సాధ్యం కాని పని. లోకం చీకటైన కనిపిస్తున్న వేళ.. తమ బిడ్డ కళ్లైనా మరొకరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆ కుటుంబం భావించింది. మా వర్షిత భౌతికంగా మా మధ్య లేకపోయినా, ఆమె కళ్లు ఈ ప్రపంచాన్ని చూస్తూనే ఉండాలి" అంటూ గుండె నిండా భారంతోనే వారు నేత్రదానానికి ముందుకు వచ్చారు. మరణించిన కొద్ది సేపటికే వర్షిత నేత్రాలను సేకరించి, ఇద్దరు అంధులకు చూపునిచ్చేలా చేసిన ఆ కుటుంబ నిర్ణయం సభ్య సమాజానికి ఒక గొప్ప పాఠం.

**ఒక ప్రేరణ.. ఒక ఆదర్శం**

సాధారణంగా చావు ఇంట్లో ఆక్రందనలు, ఆచారాల మధ్య ఇలాంటి ఆలోచన రావడం చాలా అరుదు. కానీ వర్షిత కుటుంబ సభ్యులు తమ వ్యక్తిగత బాధను పక్కన పెట్టి, సామాజిక బాధ్యతను భుజానికెత్తుకున్నారు. అడిగిన వెంటనే స్పందించి, నేత్రదానం చేయడం ద్వారా వర్షితను అమరజీవిగా మార్చారు. చావు తర్వాత కూడా జీవించడం అంటే ఇదే.. అంటూ పట్టణ ప్రజలు వర్షిత త్యాగాన్ని, ఆమె కుటుంబ సభ్యుల గొప్ప మనసును కొనియాడుతున్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఈ స్ఫూర్తితో మరికొందరు అవయవదానానికి ముందుకు రావాలని కోరుతున్నారు.

## గడి పాఠశాలలో ఘనంగా శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది ఉత్సవాలు



కోరుట్ల మార్చి 20 (మనం న్యూస్) : ప్రాథమిక పాఠశాల యస్ ఆర్ యస్ పి క్యాంప్ గడి కల్లూరు రోడ్ కోరుట్ల యందు ముందస్తు ఉగాది సంబరాలు ఘనంగా జరిగాయి.ఇట్టి కార్యక్రమంలో కోరుట్ల ఎంపిడిఓ కిషన్ మాట్లాడుతూ తెలుగు క్యాలెండర్‌లో కొత్త సంవత్సరపు మొదటి రోజుగా, మన సంప్రదాయాలను, సంస్కృతి, భవిష్యత్ ఆశలను ప్రతిబింబిస్తుంది. ఈ రోజు, మనం పాత సంవత్సరాన్ని వీడుతూ, కొత్త ఆశయాలను అలవరుచుకుంటున్నాం.ఈ ఉగాది పర్వదినం విద్యార్థుల జీవితం లో కొత్త శక్తిని, కొత్త లక్ష్యాలను నిర్దేశించే దినంగా ఉండాలి. మీరు చదువులో, కౌశల్యంలో, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభను ప్రదర్శించాలి. ప్రతి ఒక్కరు తమ స్వప్నాలను నిజం చేసే దిశగా పని చేయాలి. మన గురువులు, తల్లిదండ్రులు, స్నేహితుల సహకారం వల్ల, మీరు ప్రతిభలోనూ, నైతిక విలువలలోనూ మెదిలి ముందుకు పోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు సునావత్ రాజు మాట్లాడుతూ ఈ రోజు మన జీవితాలలో నూతన మార్గాలు, కొత్త ఆలోచనలు తెచ్చిపెట్టాలి. మీరు అందరూ బహుముఖ ప్రతిభతో, విజయంతో నిలిచేలా కోరుకుంటూ, మీ ముందుకు విజయపథం వెలుగొందాలని ఆశిస్తున్నాను. విద్యార్థులచే ఉగాది పచ్చడి తయారు చేయించి,విద్యార్థులకు వారి తల్లి దండ్రులకు పంపిణీ చేశారు. ఇట్టి కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సునావత్ రాజు, ఎంపిడిఓ రాధాకృష్ణ, ఉపాధ్యాయులు కిషన్, అబ్దుల్ రవూఫ్, సుమలత, సరస్వతి, భవాని విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## 46 సంవత్సరాల కళామతల్లి సేవకు పురస్కారం

**- సబ్బని కృష్ణకు జాతీయ కళా రత్న అవార్డు**

బెల్లంపల్లి, మార్చి 20,(మనం న్యూస్) : 46 సంవత్సరాల కళామతల్లి సేవకు గుర్తింపుగా ప్రజా కళాకారుడు సబ్బని కృష్ణకు తిరుపతిలో జాతీయ కళారత్న అవార్డు ను ప్రదానం బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో అందజేశారు. ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర అధ్యక్షునిగా, గౌరవ అధ్యక్షునిగా, రచయితగా, గాయకుడిగా, దర్శకుడిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు తమిళనాడు, మహారాష్ట్ర, బీహార్, ఉత్తర ప్రదేశ్, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లో వీరాది నాటికలను, నృత్య నాటికలను, వీధి నాటకాలను, ఒగ్గు కథలను, వేలాది ప్రదర్శనలు ఇస్తూ ప్రజల భాష, ప్రజల బాణీలు తీసుకొని వాడిని ప్రజల కష్టాలను జోడించి పాలకుల విధానాలను ఎండగట్టే పాటలు అల్లి ప్రజల్లో చైతన్యాన్ని రేకెత్తించి పోరు బాటలో నడిపించిన, ఈ దోపిడి పాలనకు చరమగీతం పాడాలని నిరంతరం శ్రమిస్తున్న, ఎర్రకోటపై ఎర్ర జెండాను ఎగురవేయాలని నినాదించిన, విప్లవ కారుడు, ప్రజా నాయకుడు ఎం సి పి ఐ యు పార్టీ మాజీ కేంద్ర నాయకుడు, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో అన్ని వర్గాల ప్రజలకు, కళాకారులకు సుపరిచితులు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో తెలుగు కళాకారులకు కామ్రేడ్ సబ్బని కృష్ణ ను బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ ఈనెల 15న ఆంధ్రప్రదేశ్ తిరుపతి నగరంలో జరిగిన బహుజన రైటర్స్ 18వ సౌత్ ఇండియన్ కాన్ఫరెన్స్ లో జాతీయ కళా రత్న అవార్డును ప్రధానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యు సుబ్రహ్మణ్యం, బి ఎస్ ఏ జాతీయ జనరల్ సెక్రెటరీ జి విష్ణువర్ధన్, ఏడు రాష్ట్రాల కు చెందిన కవులు, కళాకారులు, రచయితలు,గాయకులు మేధావులు, అవార్డు గ్రహీతలు తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం

**చిన్నముల్కనూర్ లో రూ.2కే 20లీటర్ల మినరల్ వాటర్**

**ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రారంభం**



చిగురుమామిడి: మార్చి 20 (మనం న్యూస్) : శుద్ధమైన నీరు ఆరోగ్యానికి పునాది అని,ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతోనే ప్రతి ఇంటికి త్రాగునీరు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు సర్పంచ్ సాంబారి భారతమ్మ కొమురయాలు తెలిపారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్ గ్రామపంచాయతీలో ప్రజలకు తాగునీటి సమస్యను పరిష్కరించే దిశగా ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని 2రూపాయలకే 20లీటర్ల క్యాన్ వాటర్ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ సాంబారి భారతమ్మ కొమురయ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ ప్రకారం,20లీటర్ల మినరల్ వాటర్ క్యాన్‌ను కేవలం 2రూపాయలకే అందిస్తున్నామని చెప్పారు.ప్రజలకు తక్కువ ధరలో శుద్ధమైన తాగునీరు అందించడమే మా బాధ్యతని,గ్రామంలో ప్రతి కుటుంబానికి ఆరోగ్యకరమైన నీరు అందుబాటులో ఉండాలని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు.ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం మా కర్తవ్యం, భవిష్యత్తులో కూడా గ్రామ అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు తీసుకువస్తాం అని తెలిపారు.మాజీఎంపిటిసి సభ్యులు సాంబారి కొమురయ్య మాట్లాడుతూ గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి ఈ విధమైన పథకాలు అమలు చేయడం ఎంతో అవసరం.ఈ నీటి సదుపాయం వల్ల గ్రామ ప్రజలకు చాలా ఉపశమనం కలుగుతుంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పైడిపల్లి వెంకటేష్,వార్డు మెంబర్లు గట్టు రేణుక, మహమ్మద్ రజాక్,జెట్టి లత, మర్రి విజయలక్ష్మి,పంది పెల్లి కీర్తన,వంగల రాము,పిట్టల తిరుపతి,ఇరుకుల్ల సృపిత్ తదితరులు,గ్రామ పంచాయతీ సిబ్బంది,గ్రామ నాయకులు,గ్రామ ప్రజలు భారీగా పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం లేక దళారుల పాలవుతున్న పంట

**-మండలంలో దాదాపు 2వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు**

**- రూ.6 వందల నష్టంతో దళారులకు విక్రయిస్తున్న రైతులు**



చిగురుమామిడి: మార్చి 20 (మనం న్యూస్) : ప్రభుత్వం తరపున మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడంతో,చెమటోడ్చి రైతులు పండించిన మొక్కజొన్న పంట దళారుల పాలవుతుందని బిఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు గందె ప్రశాంత్ ముదిరాజ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి సీజన్ లో ప్రభుత్వం తరపున కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని,పంట చేతికి రాగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందని ఆరోపించారు.చిగురుమామిడి మండలంలోని 17గ్రామాల్లో దాదాపు 2వేల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేస్తే పంట చేతికి వచ్చి రోజులు గడుస్తున్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకుండా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశాంత్ ముదిరాజ్ ధ్వజమెత్తారు. పంట చేతికి వచ్చే సమయంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ధైర్యాన్ని కల్పించాల్సిన ప్రభుత్వం, అధికారులు రైతుల సమస్యలను పట్టించుకోకపోవడం దారుణం అన్నారు.పంట చేతికి రావాలంటే ఎన్నో అష్ట కష్టాలు పడి అటు సాగునీరు లేక ఇటు యూరియా బస్తాలు లేక ఎన్నో ఇబ్బందులు పడగా వచ్చిన పంటను కొనుగోలు చేసే దిక్కు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం 24వందల రూపాయలకు క్వింటల్ మొక్కజొన్నలు కొనుగోలు చేస్తున్నామని చెప్తుండగా, క్షేత్రస్థాయిలో మాత్రం కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతోపాటు,వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం ఆర్థిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని రైతులు దళారులకు మొక్కజొన్న పంటను 1800కే దళారులకు విక్రయిస్తున్నారని, దీంతో ఒక్కో రైతు క్వింటలకు 6వందల రూపాయలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల రుణాలను మాఫీ చేయడంలో విఫలమైందని,రైతులకు యూరియా అందించడంలో ఫెయిల్ అయిందని,రైతులకు రైతుబంధు ఇవ్వకుండా రైతులను దారుణంగా మోసం చేస్తుందని ఫైర్ అయ్యారు. రైతులకు రైతు బీమా ఊసే లేదని, రైతులు అంతా గమనిస్తున్నారనిచెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించి చిగురు మామిడి మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని మండల రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మండల పరిషత్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ



శంకరపట్నం మార్చి 21 (మనం న్యూస్) : కరీంనగర్ జిల్లా పరిషత్ సీఈవో శ్రీనివాస్ శుక్రవారం శంకరపట్నం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఎంపీడీవో గోల్కొండ కృష్ణప్రసాద్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కాసగోని ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ విప్ విజయ రమణారావుకు ఘన స్వాగతం



కరీంనగర్ : ప్రభుత్వ విప్ గా నియమితులై తొలిసారిగా పెద్దపల్లి వెళుతున్న ఎమ్మెల్యే విజయరమణా రావుకు కరీంనగర్లో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ మేయర్ అభ్యర్థి ఆకుల నర్మద నర్సన్న కార్పోరేటర్లు, కాంగ్రెస్ నాయకులు సర్పంచులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో శుక్రవారం సాయంత్రం ఘన స్వాగతం పలికారు. టపాసులు కాల్చి స్వాగతం పలికి. శాలువాలతో ఘనంగా సత్కరించారు. కరీంనగర్ జిల్లా సరిహద్దు, బైపాస్ రోడ్డు, హౌసింగ్ బోర్డ్ కాలనీలోని మాజీ కార్పొరేటర్ ఆకుల ప్రకాష్ ఇంటి వద్ద విజయ రమణారావు కు అపూర్వ స్వాగతం లభించింది. ఈ సందర్భంగా విజయ రమణారావుకు వారంతా శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విజయ రమణా రావు మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు. పెద్దపల్లి తో పాటు కరీంనగర్ నగరంలో కూడా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తానని పేర్కొన్నారు. కరీంనగర్ కాంగ్రెస్ నాయకులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని చెప్పారు. ప్రభుత్వ విప్ గా నియమితులైన పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రమణారావుకు కరీంనగర్ నియోజకవర్గ ప్రజల తరఫున వెలిచాల రాజేందర్ రావు ప్రత్యేక అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ విజయ రమణారావు మరిన్ని ఉన్నత పదవులు సాధించాలనీ ఆకాంక్షించారు. ప్రజాసేవలో నిరంతరం నిమగ్నమై ప్రజల ఆదరాభిమానాలు మరింత పొందాలని రాజేందర్రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మేయర్ అభ్యర్థి ఆకుల నర్మద నర్శయ్య స్థానిక కార్పొరేటర్ ఆకుల నందిని ఉదయ్, కార్పొరేటర్లు గంట శ్రీనివాస్, పడాల శ్రీజ అజయ్, గుమ్మడి రాజకుమార్, పడిశెట్టి వసంతలక్ష్మి భూమయ్య, మాజీ కార్పొరేటర్ ఆకుల ప్రకాష్ పట్టణ కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు రజిత రెడ్డి, నాయకులు సత్యనారాయణ రావు, సుదర్శన్ తోట రాజేందర్, నరసింహచారీ, రేగొండ సందీప్, వేముల శ్రీనివాస్ తిప్పారపు శ్రీనివాస్ జల్లోజు శ్రీనివాస్, దుగ్గి మహేందర్ పోరెడ్డి శ్రీధర్ బత్తిని కన్నయ్య గౌడ్ అట్టెపు వేణు, వాసు గౌడ్, ఇమ్రాన్, సూఫీయాన్, కపిల్ మాధవ్, ఆస్తాపురం తిరుమల, జ్యోతి రెడ్డి, హసీనా బేగం, శిల్ప, కనకరాజు, కార్తిక్, కౌశిక్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# కళాశాల ఘటనపై వామపక్ష విద్యార్థి సంఘాల తీవ్ర ఆందోళన

జైపూర్ , మార్చి: 2 0 (మనం న్యూస్) : జైపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షల సమయంలో చోటుచేసుకున్న "మాస్ కాపీయింగ్" ఆరోపణలు, అనంతర పరిణామాలు రాజకీయంగా, విద్యార్థి వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఏ ఐ ఎస్ బి, ఎస్ ఎఫ్ ఐ, పిడి ఎస్ యు, యు ఎస్ ఎఫ్ ఐ,వంటి వామపక్ష విద్యార్థి సంఘాలు జైపూర్ మండల కేంద్రంలో శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఈ అంశంపై స్పష్టత, న్యాయం కోరాయి.ఇటీవల జరిగిన సంఘటన నేపథ్యంలో ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగుతుందన్న ఆరోపణలతో రాష్ట్ర అబ్జర్వింగ్ కమిటీ, పరీక్షా కేంద్రం చీఫ్ సూపర్డెంట్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసింది. అదనంగా ముగ్గురు సిబ్బందిని పరీక్ష కేంద్రం నుండి తొలగించాలని ఆదేశించింది. ఈ విషయాన్ని విద్యార్థి సంఘాలు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లగా, కళాశాలకు వెళ్లి అబ్జర్వేషన్ టీం సూచనలను పాటించాలని చీఫ్ సూపర్డెంట్‌కు సూచించారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో విద్యార్థి నేతలు మళ్లీ ఫిర్యాదు చేశారు.ఫిర్యాదుల ఆధారంగా జిల్లా కలెక్టర్, రాష్ట్ర ఇంటర్ బోర్డు పరీక్షల నియంత్రణ అధికారికి కూడా లేఖలు వెళ్లాయి.అంతర్గత విచారణ తర్వాత, పరీక్షలు ముగియగానే ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌ను తొలగించి రెగ్యులర్ ప్రిన్సిపల్‌ను నియమించారు.అయితే, రాష్ట్ర బోర్డు కార్యాలయంలో ఫిర్యాదు చేసిన కొన్ని గంటల్లోనే, ఒక్క నిమిషం నిడివిగల ఎడిటెడ్ వీడియో సోషల్ మీడియాలో ప్రచారమైంది. దీనిలో చీఫ్ సూపర్డెంట్‌ను విద్యార్థి సంఘ నేత కనుకుంట్ల సన్నీ గౌడ్ వేధించారని ఆరోపిస్తూ తప్పుడు ప్రచారంతో కొత్త వివాదానికి మలుపు తిరిగింది. దీనిపై వామపక్ష సంఘాలు స్పందించారు. ఏ ఐ ఎస్ బి జిల్లా ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల సన్నీ గౌడ్ ఈ వార్తలను ఖండించారు. "వాస్తవాలపై మాట్లాడితే, అసత్య ఆరోపణలు చేయడం సరికాదు. పూర్తి వీడియోను బహిర్గతం చేయాలి," అని డిమాండ్ చేశారు.వారం రోజుల కిందటి వీడియో, అధికారులను కలిసిన తర్వాతే విడుదల కావడం వెనుక కుట్ర ఉందని, సమస్య తీవ్రతను పక్కదారి పట్టించేందుకు అసత్య ప్రచారాన్ని తెరలేపారని ఆరోపించారు. విద్యార్థి సంఘాలు ఎప్పుడూ వాస్తవాల ఆధారంగానే ఆందోళనలు చేస్తాయని స్పష్టం చేశారు.ఇంటర్ బోర్డు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి,పరీక్షల్లో అవకతవకలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు అభినవ్, సికిందర్, తిరుపతి, అరవింద్,కుబుతు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే కవ్వంపల్లికి ఉగాది శుభాకాంక్షలు వెల్లువ



శంకరపట్నం మార్చి20 (మనం న్యూస్) : శంకరపట్నం మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు శంకరపట్నం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోపగోని బసవయ్య గౌడ్, హుజురాబాద్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు నాంపల్లి తిరుపతి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గట్టు తిరుపతి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దుర్గపు తిరుపతి, మండల కాంగ్రెస్ పార్టీ ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షులు గొట్టే మధు,మాజీ సర్పంచ్ బండారు తిరుపతి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

# కన్యకాపరమేశ్వరి దేవాలయంలో పంచాంగ శ్రవణం




కరీంనగర్, మార్చ్ 20(మనం న్యూస్ ):- పరాభవ నామ సంవత్సరం ఉగాది పండుగను పురస్కరించుకొని స్థానిక అశోక్ నగర్ లోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలోగురువారం పంచాంగ శ్రవణం నిర్వహించారు.వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ క్యాలెండర్ ఈవెంట్లో భాగంగా, పరాభవ నామ సంవత్సరం ఉగాది పండుగను పురస్కరించుకొని వాసవి క్లబ్ ఎమ్మార్ కరీంనగర్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించగా పారువేళ్ల ఫణి శర్మ పంచాంగ వివరణ చేసారు. ఈ సందర్బంగా ఉగాది పచ్చడి పంపిణీ చేసారు ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఎమ్మార్ అధ్యక్షుడు చిట్టి మల్ల సత్యనారాయణ, సెక్రటరీ పాత రాహుల్,కోశాధికారి పైడ రవి ,గౌరవ క్లబ్ సభ్యులు కోడిత్యాల శివానందం, నగునూరి సుధాకర్ , మాడిశెట్టి గోపాల్ , బోనగిరి రామచంద్రం , కొండూరి ప్రసాద్ ,వొజ్జల వెంకటేశం , కేశెట్టి నాగరాజు , క్లబ్ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.

# భూనిర్వాసితులకు ఇళ్లస్థలాల స్థలం పరిశీలన

గంగాధర, మార్చి 20, ( మనం న్యూస్ ): గంగాధర మండలం రంగరావు పల్లె గ్రామం నుండి కొత్తపెల్లి మనోహరాబాద్ రైల్వే లైన్ లో ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితుల కోసం ఇళ్లస్థలాలకు స్థలాన్ని ఆర్డీవో మహేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గర్శకుర్తి గ్రామ శివారులోని విలాసాగర్ రోడ్డులో గల ప్రకృతి వనం దగ్గర ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసరి శంకరయ్య, ఆర్ ఐ, సర్వేయార్ పాల్గొన్నారు.



# పోలీసుల ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ అవగాహన




గంగాధర, మార్చి 20, ( మనం న్యూస్ ) : గంగాధర మండలం కాచిరెడ్డిపల్లి గ్రామంలో స్థానిక ఎస్సై వంశీకృష్ణ రోడ్ సేఫ్టీపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు అధికంగా జరగడానికి ప్రధాన కారణం ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడమేనని అన్నారు. ప్రతి వాహనదారుడికి ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ వినియోగించాలని, మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదకరం అన్నారు. అధిక వేగంతో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని వాహనం నడుపుతున్నప్పుడు మొబైల్ ఫోన్ వినియోగం ప్రమాదానికి దారితీస్తుందని తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు సూచికలను గౌరవించాలని, వేగ నియంత్రణ పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు రోడ్డు భద్రతపై బాధ్యత వహించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవిస్తూ వాహనాలు నడపడం ప్రతి పౌరుని కర్తవ్యమని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచి, రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, యువకులు , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఎస్సై కుటుంబ సభ్యుల ప్రత్యేక పూజలు



చిగురు మామిడి మార్చి 20 (మనం న్యూస్) : చిగురుమామిడి:ఉగాది పండుగా పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని సుందరగిరి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో చిగురుమామిడి ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన ఎస్ఐ కుటుంబ సభ్యులకు వారు ఘన స్వాగతం పలికి కండువా వేసి ఘనంగా సత్కరించారు. ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ చరిత్రను విశిష్టతను ఆలయ ధర్మకర్త శేషం నరసింహ చార్యులు,అర్చకులు శేషం శ్రీనివాసచార్యులు ఎస్సైకి వివరించారు. స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని,ఎలాంటి వివాదాలు లేకుండా శాంతియుత వాతావరణంలో అన్ని గ్రామాల ప్రజలు ఉండాలని కోరారు.

# కాచిరెడ్డిపల్లిలో సీసీ కెమెరాలు ఏర్పాటు



గంగాధర, మార్చి 20, ( మనం న్యూస్ ): గంగాధర మండలం కాచిరెడ్డిపల్లి గ్రామంలో భద్రతను మరింత బలోపేతం చేయడానికి ఏర్పాటు చేసిన తొమ్మిది సీసీ కెమెరాలను శుక్రవారం ఎస్సై బి. వంశీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామంలో సీసీ కెమెరాల వ్యవస్థ ఏర్పాటు ద్వారా నేరాలను నియంత్రించడం, అనుమానాస్పద కదలికలను గుర్తించడం సులభమవుతుందన్నారు. ప్రజల భద్రతను కాపాడడంలో సీసీ కెమెరాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. బచ్చు దయాకర్ సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఏదైనా నేర సంఘటనలు జరిగినప్పుడు దర్యాప్తుకు ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వివరించారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరిస్తూ గ్రామ భద్రతను కాపాడేందుకు ముందుకు రావాలని సూచించారు. సీసీ కెమెరాల నిర్వహణను సక్రమంగా కొనసాగించాలని, వాటి ద్వారా గ్రామంలో శాంతి భద్రతలు మెరుగు పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోల మమత శ్రీనివాస్, ఉపసర్పంచ్, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజలను మభ్యపెట్టే అంకెల గారడి రాష్ట్ర బడ్జెట్

**- సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి**



కరీంనగర్ మార్చి 20(మనం బ్యూరో) : 2026- 27 సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ను శుక్రవారం ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రతిపాదించిన 3,24,234 కోట్ల బడ్జెట్ రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టే విధంగా ఉందన్నారు. అంకెల గారడీ తప్ప ఒరిగేది ఏమీ లేదనీ జిల్లా కేంద్రంలో దశాబ్దాల కాలంగా ఎదురుచూస్తున్న డంప్ సమస్య ఊసే లేదన్నారు. పెండింగ్ రైల్వే లైన్లకు అలకేషన్స్ లేవనీఉ త్పాదకరంగాలకు బడ్జెట్లో తగినంత నిధులు కేటాయించలేదన్నారు. ఇరిగేషన్ శాఖకు కేవలం 22, 615కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. పెండింగ్ పనులు ఎలా పూర్తి చేస్తారో చూడాలన్నారు. ఎన్నికలకు ముందు 400కు పైగా హామీలు ఇచ్చారని హామీల అమలుకు బడ్జెట్లో కేటాయింపులు లేవనీ వాస్తవ పరిస్థితులకు పూర్తి విరుద్ధంగా ఉన్న బడ్జెట్ ఆర్థిక మంత్రి ప్రసంగంలో భారీ హామీలు గొప్ప పదజాలం తప్ప ఏమీ లేదన్నారు. ఉన్నత విద్యపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని నిరూపితమైందనీ. విద్యా కమిషన్ సిఫార్సుల మేరకు బడ్జెట్లో కేటాయింపులు లేవన్నారు. 9500 కోట్లకు పైగా ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల ఊసే లేదు. నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్న సమయంలో కాళీ ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేయకుండా, నిరుద్యోగ భృతి కల్పన లేకుండా బడ్జెట్ ఉందన్నారు. బడ్జెట్ను సవరించి ప్రాధాన్యత రంగాలకు బడ్జెట్ను పెంచి సవరించాలన్నారు.

# వివాదం పరిష్కరించాలని వినతి



రాయికల్, మార్చి 20(మనం న్యూస్) : రాయికల్ మండలం మైతాపూర్ లో రోడ్డు నిర్మాణ పనులు నిలిచి పోయాయని, భూ వివాదం లో పరిష్కరించాలని వార్డు సభ్యులు శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలోని శ్రీ గిరిగుట్ట (గన్నేగుట్ట)పై సుమారు ముప్పై ఏళ్ల క్రితం నిర్మించిన కనకదుర్గాదేవి ఆలయానికి మెయిన్ రోడ్డునుంచి సిమెంట్ రహదారి నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు దామోదరరావు తన నిధుల నుంచి రూ.15 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో రహదారి పనులు ప్రారంభమైనప్పటికీ,మధ్యలో భూమి పట్టాదారులు అడ్డుపడటంతో పనులు నిలిచిపోయినట్లు పేర్కొన్నారు. భూమి సరిహద్దుల విషయంలో స్పష్టత లేకపోవడంతో వివాదం నెలకొన్నదని,రెవెన్యూ శాఖ అధికారులు,సర్వే నిర్వహించి పరిష్కరించాలని వార్డు సభ్యులు బత్తిని శ్రీనివాస్, తొగిటి నవీన్,అనుమల్ల రమ,బూస గంగామల్లయ్య,భూపల్లి పరమేష్, స్థానిక నాయకులు సత్యనారాయణ కలిసి తహసీల్దార్‌ను కోరారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ తొఫాలు పంపిణీ చేసిన గొల్లపెల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు



గొల్లపెల్లి మార్చి 20 (మనం న్యూస్) : జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశానుసారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్ గార్ల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ముస్లిం సోదరులకు రంజాన్ తొఫా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు గొల్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు నిశాంత్ రెడ్డి మాట్లాడుతూ ఇది ప్రజా ప్రభుత్వం ముస్లిం సోదరుల అభివృద్ధి కొరకు ఎల్లవేళల తప్పకుండా పనిచేస్తుందన్నారు,ముస్లిం సోదరులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారికి ధన్యవాదాలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి , మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు రాపల్లి గంగన్న, చెవులమద్ది గంగాధర్, చిర్ర దిలీప్, చెవులమద్ది రమేష్, సిరికొండ తిరుపతి, చెవులమద్ది విక్రమ్, గంగాధర నరేష్, చెవులమద్ది మల్లేష్, చెవులమద్ది గంగమల్లు, ఆవుల ప్రవీణ్, జెరిపోతుల రాజేష్ ,తుడం నవీన్, కాలువ మధు ,తూర్పతి అంజన్న ,కట్కూరి రామయ్యా, రామడుగు తిరుపతి ,నేరెళ్ళ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



చిగురుమామిడి మార్చి 20 (మనం న్యూస్) : ప్రభుత్వం నుండి అనుమతి లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని చిగురుమామిడి ఎస్సై పృథ్వీధర్ గౌడ్ హెచ్చరించారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రామంచ గ్రామంలోని మోయ తుమ్మెద వాగు నుండి ప్రభుత్వ నుండి ఎలాంటి అనుమతి లేకుండా దొంగతనంగా వాగు నుండి ముల్కనూర్ కు ఇసుక రవాణా చేస్తున్న 3ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకొని సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఏపీ 15ఏయూ 3359నెంబర్ గల ట్రాక్టర్ డ్రైవర్ చెరుకు కుమారస్వామి, యజమాని అయిన మూలపాల శ్రీనివాస్, చెరుకు కుమారస్వామి రామంచ ట్రాక్టర్ నెంబర్ టీఎస్ 19 టి 7076 డ్రైవర్ కందుగుల ప్రశాంత్ దాని యజమాని అయిన తుంగ పరశురాములు, ట్రాక్టర్ నెంబర్ టి ఎస్ 22 టీ 1705 డ్రైవర్ నందకిశోర్, యజమాని అయిన వంటకాల రంజిత్ రెడ్డి అనువారిని పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. నుండి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేయడం నేరమని ఎస్సై హెచ్చరించారు.

## శివారం ఎర్ర చెరువు వద్ద మొసలి భయం

**- మూడు రోజుల్లో రెండు గేదెలు బలి**



జైపూర్, మార్చి 20 (మనం న్యూస్) : జైపూర్ మండలం శివారం గ్రామ సమీపంలోని ఎర్ర చెరువు వద్ద మొసళ్ళ భయం ఏర్పడిందని గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం రెండు గేదెలపై మొసలి దాడి ఘటన వెలుగులోకి వచ్చిందని స్థానికులు తెలిపారు. స్థానికుల వివరాల ప్రకారం: ఎలిమడుగు పరిసరాల్లో ఉండాల్సిన మొసళ్ళు ఇప్పుడు చెరువులో నివాసమేర్పరచుకున్నాయి. గత మూడు రోజుల క్రితం లంబు సంపత్ రెడ్డికి చెందిన గేదెపై మొసలి దాడి చేసింది. తాజాగా గెల్లు సారక్క గేదె కూడా అదే విధంగా బలైంది. ఒక్కో గేదె విలువ సుమారు రూ60,000 ఉంటుందని రైతులు చెబుతున్నారు. దాహార్తి తీర్చుకోవడానికి వెళ్లిన మూగజీవాలు మొసలి బారిన పడటంతో బాధిత కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే మరిన్ని పశువులు ప్రమాదంలో పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పాడి రైతులు, గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తి చేస్తూ, ఎర్ర చెరువు చుట్టూ తక్షణమే రక్షణ కంచె నిర్మించాలని, అటవీశాఖ ద్వారా మొసళ్లను సురక్షితంగా తరలించాలని కోరారు. ప్రమాదాలు పునరావృతం కాకముందే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## సైక్లింగ్ అసోసియేషన్ ఛైర్మన్‌గా "అల్ఫోర్స్" నరేందర్‌రెడ్డి



కరీంనగర్ మార్చి 20(మనం బ్యూరో) : కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్గా అల్ఫోర్స్ నరేందర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైక్లింగ్ క్రీడకు ప్రత్యేకత ఉన్నదని ఈ క్రీడకు విస్తృత ప్రచారం చాలా అవసరమని డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం వ్యాప్తంగా కరీంనగర్ జిల్లా సైకిల్ అసోసియేషన్ కి ప్రత్యేకత ఉన్నదని ఎన్నో టోర్నమెంట్లు ను నిర్వహించి క్రీడ స్ఫూర్తిని పెంపొందించిందని అన్నారు. అదే విధంగా రాష్ట్ర సంఘానికి సైతం చేయూతనిచ్చామనీ వారు నిర్వహించిన వివిధ రకాల టోర్నమెంట్లను చాంపియన్షిప్ పోటీలను తరగని ఉత్సాహంతో చక్కటి సమన్వయంతో కార్యక్రమాలను సైతం జయప్రదం చేసి క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంలో చాలా కీలకంగా వ్యవహరించిందని తెలిపారు. ఈ సంఘానికి డాక్టర్ బంగారు స్వామి ఎస్. కోదండరాములు ఫ్యాట్రన్స్ గా వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు క్రీడాకారులు.

## జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడిగా బొమ్మన హరీష్ గౌడ్ నియామకం



నెన్నెల, మార్చి 19 (మనం న్యూస్): నెన్నెల మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొమ్మెన హరీష్ గౌడ్ మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మరియు ఏఐసీసీ అధిష్టానం ఆమోదంతో ఈ నియామకం జరిగినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. హరీష్ గౌడ్ గతంలో మండల స్థాయిలో పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేయడంతో పాటు ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ మంచి గుర్తింపు పొందారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం ఈ పదవిని అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా హరీష్ గౌడ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా స్థాయిలో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని తెలిపారు.

## వార్డు సభ్యుల కు గౌరవ వేతనం ఇవ్వాలి



బోయిన్ పల్లి, మార్చ్ 20(మనం న్యూస్ ):-తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు గౌరవ వేతనం ఇవ్వాలని తెలంగాణ వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వార్డు సభ్యులు వార్డు గ్రామ అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్నారని వారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని గౌరవ వేతనం ఇవ్వాలని పేర్కొన్నారు. వార్డు సభ్యులకు తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకమైన ఇన్సూరెన్స్ లు కల్పించాలని , ప్రమాద బీమా పథకం ప్రవేశపెట్టాలని తెలిపారు. వార్డు సభ్యుల అభివృద్ధికి ప్రత్యేక నిర్ణయాలు ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వార్డు సభ్యుల సంఘం రాష్ట్ర నాయకులు బత్తిని అనిల్, మునీందర్ తదితరులు పాల్గొన్నారు.

## గంగిపల్లిలో రంజాన్ తోఫా పంపిణీ



జైపూర్, మార్చి :20 (మనం న్యూస్) : జైపూర్ మండలం గంగిపల్లి గ్రామంలో శుక్రవారం స్థానిక కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ముస్లిం మహిళలకు రంజాన్ తోఫాగా చీరల పంపిణీ నిర్వహించారు. చెన్నూరు ఎమ్మెల్యే, మంత్రి వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు గ్రామంలోని ముస్లిం కుటుంబాలకు చీరలు అందజేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. గ్రామస్థులు కాంగ్రెస్ నాయకుల చొరవను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుందిల్ల మల్లేష్, శీలం వెంకటేష్, రిక్కుల వెంకటరెడ్డి, అబ్దుల్లా, నజీర్, వెంకట్ రెడ్డి, సుందిల్ల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్య రంగాన్ని విస్మరించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం



కరీంనగర్ మార్చి 20(మనం బ్యూరో) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యా రంగాన్ని విస్మరించిందని రేవంత్ రెడ్డి కి విద్య వ్యవస్థ పై చిత్తశుద్ధి లేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిమచ్చ రమేష్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో విద్యారంగానికి కేటాయించిన నిధులను చూస్తే అర్థమవుతుందని ఇది ముమ్మాటికి విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వం అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల్లో ఇచ్చిన విధంగా విద్యార్థులకు బడ్జెట్ కేటాయించకుండా విద్యార్థి వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని ఇలా చేస్తే రానున్న కాలంలో కాంగ్రెస్ కు రాష్ట్రంలో పుట్టగతులు ఉండవని మచ్చ రమేష్ హెచ్చరించారు.

## కేవీ దరఖాస్తులు స్వీకరణ

- ఒకటో తరగతికి ఆన్లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం
- ఏప్రిల్ 2 దరఖాస్తులకు ఆఖరి గడువు

హాజీపూర్ మార్చి 20 (మనం న్యూస్): గుడిపేట్ లో ఉన్న కేంద్రీయ విద్యాలయం లో 2026-27 విద్యాసంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతి నుంచి 10 తరగతుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు కేంద్ర విద్యాలయ సంఘటన్ సమగ్ర షెడ్యూల్ను ప్రకటించింది. నేటి నుంచి (మార్చి 20) ఆన్లైన్ ద్వారా దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఏప్రిల్ 02 న సాయంత్రం వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది . మొదటి జాబితా ఏప్రిల్ 09 న., రెండో, మూడో జాబితా వరుసగా ఏప్రిల్ 16 మరియు ఏప్రిల్ 21 తేదీల్లో ప్రకటిస్తారు.ఒకటవ తరగతి ప్రవేశం కోరే విద్యార్థులు 2018 మార్చ్ 31 నుంచి 2020 మార్చ్ 31 లో జన్మించి యుండాలి. ఒకటో తరగతి: 6 ఏళ్లు నిండి ఉండాలి (8 ఏళ్ల లోపు) ఉండాలి.పూర్తిగా ఆన్లైన్ లోనే దరఖాస్తు ప్రక్రియ వుంటుంది.

**ఆఫ్లైన్లో దరఖాస్తులు**

కాగా ఈ విద్యాసంవత్సరం నుంచి 1 నుంచి 5 తరగతుల వరకు రెండు సెక్షన్ లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.గతంలో ఒక సెక్షన్ వుండడంతో సీట్ల కోసం పోటీ ఉండేది.ఇక రెండవ తరగతి నుంచి 10 వ తరగతి వరకు ఖాళీల ను బట్టి ఏప్రిల్ 2 నుంచి 8 వ తేది వరకు ఆఫ్ లైన్ లో దరఖాస్తులు చేసుకోవచ్చు.ఆఫ్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చు దరఖాస్తు ఫారాలు గుడిపేట్ లోని కేంద్రీయ విద్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకొని తీసుకోవాల్సి వుంటుంది. సెలెక్ట్ జాబితాను ఏప్రిల్ 13 న విడుదల చేస్తారు.

## బెల్లంపల్లిలో సుందరకాండ పారాయణానికి ఆహ్వానం

బెల్లంపల్లి, మార్చి 20,(మనం న్యూస్) : బెల్లంపల్లి పట్టణంలోని కన్యక పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం సహకారంతో రామ్ భక్తులు, ఆంజనేయ స్వామి మాల ధరించిన భక్తులు కలిసి సుందరకాండ పారాయణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం మార్చి 21 శనివారం నుంచి 25 మార్చి వరకు సాయంత్రం 7:30 గంటల నుండి 9:30 గంటల వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆంజనేయ స్వాములు కోరారు.

## పాత పెన్షన్ ప్రస్తావన లేకపోవడం విచారకరం



ధర్మపురి మార్చ్ 20 మనం న్యూస్: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్లో ప్రజా పాలన మానిఫెస్టో లో ఉద్యోగుల గురించిన మొట్టమొదటి అంశం అయిన పాత పెన్షన్ పెట్టిన ప్రస్తావన లేకపోవడం విచారకరం అని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మ్యాన పవన్ కుమార్ అన్నారు దేశం లో కాంగ్రెస్ పార్టీ అధికారం లో ఉన్న రాష్ట్రంలలో మానిఫెస్టో లో పెట్టిన విధం గా పాత పెన్షన్ పునరుద్ధరణ జరుగుతుంటే ఇక్కడ కనీసం దాని గురించి ప్రస్తావన లేకపోవడం విచారకరం అని,ప్రభుత్వం మొత్తం బడ్జెట్ వ్యయాన్ని 3,24,234 కోట్లుగా చూపినప్పటికీ, విద్యారంగానికి కేటాయించిన 26,674 కోట్లు మొత్తం బడ్జెట్లో కేవలం 8.23% మాత్రమేనని వం-సగా మూడవ బడ్జెట్ లో కూడా మానిఫెస్టో లో హామీ ఇచ్చిన 15% నిధులను విద్యాశాఖకు కేటాయించడంలో ప్రభుత్వం విఫలమైందని,, ముప్పై మూడు నెలలు గడుస్తున్న పి ఆర్ సి గూర్చి, పెండింగ్ డి ఏ బకాయిల గురించి బడ్జెట్ లో కేటాయింపులు లేవని వీటి గురించి రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డిక్షనరీ ల పంపిణి

జన్నారం మార్చి 20(మనం న్యూస్)జన్నారం మండలం లోని కిష్టాపూర్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం డిక్షనరీలను పంపిణి చేయటం జరిగిందని ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా ఉద్యోగం చేస్తున్న కిష్టాపూర్ గ్రామానికి చెందిన సేదర్ల రాం మోహన్ సేదర్ల ఉదయ్ లు డిక్షణరీలను పంపిణి చేయటం జరిగిందని తెలిపారు. ఈ డిక్షనరీలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగ పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పరదానోపాధ్యాయులు సుధాకర్ నాయక్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.



## రక్తసంబంధీకుల నుండి చట్టపరమైన దత్తత ఇచ్చిన కలెక్టర్



కరీంనగర్ మార్చి 20(మనం బ్యూరో) : పిల్లలు లేని దంపతులకు రక్త సంబంధీకుల నుండి చట్టపరమైన దత్తతను జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా చేతుల మీదుగా ఇచ్చారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ-మిషన్ వాత్సల్య అధ్వర్యంలో కరీంనగర్ కు చెందిన పిల్లలు లేని దంపతులకు వారి రక్త సంబంధీకుల నుండి 1 సంవత్సరం పాపను చట్ట పరమైనదత్తత ఉత్తర్వులతో దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని అన్నారు. దత్తత, రక్త సంబంధీకుల నుండి దత్తత తీసుకోవాలనుకునే వారు జిల్లా పరిషత్ లోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించగలరు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి యం. సరస్వతి జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డిసిపిఓ) దుర్దాన పర్వీన్, ఎల్.పి.ఓ రాజు, యం.రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబానికి భరోసా.. సంక్షేమానికి పెద్దపీట

- ఆరోగ్యం, విద్య, సంక్షేమ రంగాలకు అత్యంత ప్రాధాన్యం
- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల



కరీంనగర్ మార్చి 20(మనం బ్యూరో) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల బడ్జెట్. ఆరోగ్యం విద్య సంక్షేమ రంగాలకు పెద్దపీటవేయడం శుభసూచకం అని కరీంనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు నిధులు కేటాయించడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం. వ్యవసాయానికి 23,179 కోట్లు , విద్యారంగానికి దాదాపు 26 వేల కోట్లు సాగునీటి రంగానికి 22615 పంచాయతీరాజ్ శాఖకు 33 వేల కోట్లు.. మెట్రో రైల్ కారిడార్ల విస్తరణకు 24 వేల కోట్లు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల సంక్షేమానికి పెద్ద పీట వేయడం.. దేశ చరిత్రలోనే తొలిసారి.. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూపుదిద్దుకున్న ఈ బడ్జెట్ తెలంగాణను ప్రగతి పథంలో తీసుకెళ్తుంది. ప్రజల ఆరోగ్యం జీవిత బీమాకు పెద్దపీట వేసింది సర్కారు.. ఆరోగ్యశాఖకు 13 679 కోట్లు కేటాయించి కోటి 15 లక్షల కుటుంబాలకు బీమా భరోసా కల్పిస్తూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించడం దేశ చరిత్రలోనే చారిత్రాత్మకం. ఇలాంటి మహత్తరమైన పథకం ఏ రాష్ట్రంలోనూ లేదు.. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రకటించడం విద్యారంగం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం.. రాష్ట్ర ప్రజల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బడ్జెట్ ను రూపొందించి నూతన ఒరవడితో ముందుకు వెళ్లడం శుభపరిణామం.

## రామడుగులో మెగా హెల్త్ క్యాంప్



రామడుగు మార్చి 20 (మనం బ్యూరో) : 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రామడుగు లో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ క్యాంపు ను రామడుగు సర్పంచ్ మోహిజ్ , మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గ్రీష్మ ప్రారంభించినారు. మెగా క్యాంపు వివిధ రకాల వ్యాధులకు (జనరల్ మెడిసిన్ వైద్యులు , కంటి వైద్యులు, దంత వైద్య లు, ఎముకల మరియు కీళ్ళ వైద్య లు, చిన్న పిల్లల వైద్య లు మరియు స్త్రీ వ్యాధుల నిపుణులు పాల్గొని, 148 మందికి చికిత్సలు అందించారు. ఈ కార్యక్రమం లో డాక్టర్స్ హెల్త్ సూపర్ వైసర్లు, ఏఎన్ఎం , ఆశలు పాల్గొన్నారు.



# ప్రజలకు వేగవంతమైన, సౌకర్యవంతమైన పోలీస్ సేవలు

మెట్‌పల్లి మార్చి 20 (మనం న్యూస్) ప్రజలకు వేగవంతమైన, సౌకర్యవంతమైన పోలీస్ సేవలు అందించాలనే లక్ష్యంతో. తెలంగాణ రాష్ట్ర డిజిపి. జిల్లా ఎస్పీ ఆదేశాల మే-రకు. ప్రత్యేక నేరాల్లో బాధితుల వద్దకు వెళ్లి. పోలీస్ స్టేషన్ వెళ్లే అవసరం లేకుండా. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి కిరణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన కేసుకు సంబంధించిన వివరాలు తెలుపుతూ. తేదీ 20.03.2026 శుక్రవారం సాయంత్రం 03:30 గంటల సమయంలో. పట్టణంలోని కొత్త బస్టాండ్ ఇన్ గేటు వద్ద రోడ్డు ప్రమాదం జరిగిందన్నారు. బాధితులు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉండగా. అక్కడికి వెళ్లి బాధితుల వద్ద నుండి పిర్యాదు తీసుకొని వెంటనే ఆన్ లైన్ ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయడం జరిగిందన్నారు.ఈ కేసు వివరాలు తెలుపుతూ పనటి దుర్గయ్య ం/శీ అగమమ్య, 65 సంవత్సరాలు, ఎస్సీ- బెడబుడిగే జంగం, మెట్ పల్లి శాంతి నగర్ కు చెందినవ్యక్తి ఇన్ గేట్ న్యూ బస్టాండ్ మెట్ పల్లి వద్ద ఉండగ. ఆర్టీసీ బస్ ౧+ - 16-౿-2585 నెంబర్ గల దాని డ్రైవర్ అయిన. మరిపల్లి నారగౌడ్ తీ/శీ ముస్తాపూర్ లింగంపల్లి, కామారెడ్డి జిల్లా కు చెందిన అతను అతివేగంగా అజాగ్రత్తగా తన బస్ ను నడిపి దుర్గయ్యా కు టక్కరివ్వగా అతనికి కుడి చేతికి మరియు ఇతర



శరీర భాగాలకి తీవ్ర గాయాలు అయ్యాయన్నారు. దుర్గయ్యను ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించగ అక్కడి డ్యూటీ డాక్టర్ పరిశీలించి సాయంత్రం 04:00 గంటలకి చనిపోయాడు అని నిర్ధారించరని , మృతుడి భార్య అయినా పనటి విజయ ఇచ్చిన పిర్యాదు మేరకు. అక్కడే ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పిర్యాదు తీసుకొని. ఆన్ సైట్ ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంబించినట్లు ఎస్సై తెలిపారు.

# టీయూడబ్ల్యూజే (ఐజేయు) మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా ఆధ్వర్యంలో పట్టణంలోని మక్కా మసీద్‌లో ఇఫ్తార్ విందు



మెట్‌పల్లి మార్చి 20 (మనం న్యూస్) టి యు డబ్ల్యూ జే ( ఐజేయు) మెట్ పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా ఆధ్వర్యంలో. రంజన్ సందర్భంగా. పట్టణంలోని మక్కా మసీదులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణంలోని ప్రముఖులు, విలేకరులు పాల్గొని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ. పట్టణంలో అన్ని మతాల వారు సోదరభావంతో ఉ ంటారని.ప్రతి పండగను అందరూ కలిసి ఆచరిస్తారన్నారు. మతాలకు అతీతంగా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం సంతోషదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కు చెందిన పలు పత్రికల జర్నలిస్టు, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జువాడి కృష్ణారావు, కౌన్సిలర్ లు ఖాజా అజీమ్, గుడికందుల అజయ్, నునుగొండ నరేష్, మాజీ కౌన్సిలర్ మహ్మద్ షాకీర్ సిద్దికి, మాజీ ఎంపీపీ మారు సాయి రెడ్డి, మాజీ సర్పంచ్ కొమిరెడ్డి లింగారెడ్డి, టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు చీటీ శ్రీనివాసరావు, ప్రెస్ క్లబ్ గౌరవ సలహాదారు దాసం కిషన్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బూరం సంజీవ్, జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అజీమ్, ఉపాధ్యక్షులు జంగం విజయ్, అఫ్రోజ్ , జిల్లా కార్యవర్గ సభ్యులు సాజిద్ పాషా, బాసెట్టి హరీష్, క్యాషియర్ మక్సూద్, జాయింట్ సెక్రెటరీ పుంద్ర శశికాంత్ రెడ్డి, పింజర్ శివ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎండి సమీయుద్దీన్, కార్యవర్గ సభ్యులు పొనగాని మహేందర్, కుర్ర రాజేందర్ , యానం రాకేష్ ,రఫీ ఉల్లా, సోహెల్ , హైమద్, ముత్యాల రమేష్ , ఓంకారి శ్రీనివాస్,బొల్లం రాజు,మాజీ అధ్యక్షుడు ఆగ సురేష్ సభ్యులు ఆదిల్ పాషా, రమణ, ఏసమేని గణేష్, ఎండి అభిద్, శశి కుమారు, అమ్ముల ప్రవీణ్ ,తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రంజాన్ తోపా కిట్‌ల పంపిణి

జన్నారం మార్చి 20(మనం న్యూస్)రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని జన్నారం మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లీం సోదరులకు తోపా కిట్ లను పంపిణి చేయటం జరిగిందని ప్రకటనలో తెలిపారు.ముస్లీం సోదరులకు సోదరీమణులకు సహాయ సహకారాలు అందించాలని వుద్దేశ్యం తోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు.



# కోరుట్లలో అప్పుల భారంతో వ్యక్తి ఆత్మహత్య

కోరుట్ల మార్చి 20 (మనం న్యూస్) : కోరుట్ల పట్టణంలో అప్పుల బాధతో ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు కోరుట్ల సబ్ ఇన్స్పెక్టర్ చిరంజీవి పేర్కొన్నారు. పోలీసులు బంధువులు తెలిపిన వివరాల ప్రకారం రాంనగర్‌కు చెందిన వీరమల్లి ప్రసాద్ (48) శుక్రవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఐదు సంవత్సరాల క్రితం తన కుమార్తె వివాహం నిమిత్తం ప్రసాద్ సుమారు రూ.45 లక్షలు అప్పు తీసుకోగా అప్పులను తీర్చేందుకు తన ఇల్లు కూడా విక్రయించినప్పటికీ పూర్తిగా అప్పులు తీరలేదు. ఆర్థిక ఇబ్బందులు, అప్పుల ఒత్తిడి కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై ఈ దారుణ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.ఈ ఘటనపై మృతుడి భార్య వీరమల్లి కావ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి కి ఘన సన్మానం



మెట్ పల్లి మార్చి 20 ( మనం న్యూస్) పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ. ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మైలారపు రాంబాబు, కోట కిరణ్, బండారి శివకుమార్, పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# గుంతలమయమైన రహదారి

**- అవస్థలు పడుతున్న ప్రయాణికులు**

భీమిని మార్చి 20 మనం న్యూస్ : భీమిలి మండల కేంద్రం నుండి లక్ష్మీపూర్ గ్రామం వరకు ప్రధానమంత్రి గ్రామీణ సడన్ యోజన లో భాగంగా రహదారిని నిర్మాణం చేశారు ఈ రహదారి పూర్తిగా గుంతలమయమై వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతుంది వర్షం పడిందంటే రహదారి మొత్తం బుర్దమయంగా మారి గుంతల్లో నీరు చేరి ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు గత రెండు సంవత్సరాల క్రితం నంబాల నుండి జక్కులపల్లి వరకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన లో భాగంగా రహదారి నిర్మించిన అధికారులు అక్కడి వరకే పనులను నిలిపివేయడంతో లక్షింపూర్ నుండి భీమిలి వరకు ఉన్న రహదారి గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా గుంతలమయమై ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తోంది ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు ఈ రహదారిపై దృశ్యారించి గుంతల మయమైన రహదారికి కనీసం మరమ్మతులైన చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

